

ముగ్గురాయి దొంగలు

● విజిలెన్స్ నివేదికను తొక్కిపెట్టిన వైనం ● అవినీతి అధికారులపై తాత్కాలిక వేటు ● కీలక రికార్డులు మాయం చేసేందుకు యత్నాలు



ఏ-గ్రేడు ముగ్గురాళ్లు



రైల్వేకోడూరు, జూన్ 10: మంగంపేట బెరైటీస్‌లో ముగ్గురాయి దొంగలు కొన్ని టన్నుల ఏ-గ్రేడు ముగ్గురాయిని అక్రమంగా తరలించారు. దీనిపై విజిలెన్స్ అధికారులు విచారణ చేసినా ఆ నివేదికను కొందరు అధికారులు తొక్కిపెట్టి అవినీతికి పాల్పడిన అధికారులపై తాత్కాలికంగా వేటు వేసి తర్వాత విధుల్లోకి తీసుకుని ఇతర రాష్ట్రానికి బదిలీ చేశారు. కీలకమైన రికార్డులను మాయం చేసేందుకు ప్రస్తుతం ప్రయత్నాలు జరుగుతున్నాయని మంగంపేట వాసులు అంటున్నారు. ఏడాది క్రితం మంగంపేట ఏపీఎండీసీ ముగ్గురాయి డంపింగ్ యార్డులో అవినీతి అధికారులు, సిబ్బంది, అధికార పార్టీ నాయకుల సహకారంతో సుమారు 1000 లారీల్లో ఏ-గ్రేడు ముగ్గురాయిని ఒక కంపెనీకి తరలించారు. ఈ సంఘటనపై అప్పట్లో రాష్ట్రంలో కలకలం రేగింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మంగంపేటలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని పలు యూనియన్లు ఆందోళనలు చేశాయి. ముగ్గురాళ్ల గనుల్లో ఏ-గ్రేడును బీ-గ్రేడుగా, బీ-గ్రేడును సీ-గ్రేడుగా మార్చేశారనే ఆరోపణలు వినిపించాయి. ఏడాది క్రితం ఒకేరోజు రాత్రి కొన్ని వందల టన్నుల రాయిని డంప్ నుంచి అక్రమంగా తరలించారనే సంఘటనపై మంగంపేటలో కలకలం రేగింది. మంగంపేటకు చెందిన గత ప్రభుత్వ నాయకుల సహకారంతో ఒక కంపెనీకి 920 ట్రిప్పుల రాయిని అక్రమంగా తరలించారనే అభియోగం వచ్చింది. దీనిపై విజిలెన్స్ విచారణకు వైసీపీ ప్రభుత్వం ఆదేశించింది. ఏపీఎండీసీలో పనిచేస్తున్న ఒక అధికారి చేత విచారణ చేయించారు. అయితే ఆ అధికారి కేవలం 25 టన్నుల రాయి మాత్రమే తరలిపోయిందని చేతులు దులుపుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే విజిలెన్స్ అధికారులు విచారించి నివేదికను విజయవాడ కార్యాలయానికి పంపినట్లు కార్మిక సంఘాలు చెబుతున్నాయి. విజిలెన్సు నివేదికలో ఏముంది, అసలు మైనింగ్‌లో అక్రమాలకు పాల్పడింది ఎవరు అనేది ఉంటుంది. ఈ నివేదికను ఎందుకు తొక్కి పెట్టారని కార్మిక సంఘాల వాదన. మంగంపేట ముగ్గురాళ్ల సంస్థ కార్యాలయంలో పనిచేసే సీపీవో, పలువురు సిబ్బందిపై వేటు పడింది. అయితే గతంలో పనిచేసిన సీపీవో సస్పెన్షన్‌ను తొలగించి ఇతర రాష్ట్రానికి బదిలీ చేశారు. డంపింగ్ యార్డు వద్ద ఉన్న పలువురిని కూడా సస్పెండు చేశారు. అయితే ఇందులో కొందరికి ప్రమేయం లేదని స్పష్టంగా తెలియడంతో తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకున్నారు.

అసలు ముగ్గురాళ్లను దొంగతనం చేయాల్సినంత అవసరం ఎందుకు వచ్చింది, ఒక కంపెనీకి ఎందుకు అక్రమంగా రాత్రివేళలో 920 లారీల్లో 6 వేల టన్నుల ఏ-గ్రేడు రాయిని తరలించారన్నది తెలియాల్సి ఉంది. ఏ-గ్రేడు రాయి టన్ను రూ.8309, బీ-గ్రేడు టన్ను రూ.6438, సీ, డీ గ్రేడు రాయి టన్ను రూ. 2120 ధర పలుకుతోంది. ఒక ప్రైవేటు కంపెనీకి ఎందుకు లాభాన్ని చేకూర్చాలని అనుకున్నారు అనేది అంతుపట్టని విషయంగా మారింది. కేవలం రెండు లారీల్లో మాత్రమే ముగ్గురాయిని తరలించారని, దానిని రికవరీ చేశామని గతంలో అధికారులు చెప్పుకొచ్చారు. అక్రమంగా రాయి తరలిపోయేందుకు ఏపీఎండీసీ విజయవాడ నుంచి ప్రధాన సూత్రదారి చక్రం తిప్పారని కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. సూత్రధారులు ఎవరనేది తెలిసినా కేవలం తాత్కాలిక వేటుతోనే సరి పెట్టారు. మంగంపేట ఏపీఎండీసీ కార్యాలయంలో నిజాయితీగా పనిచేసిన సీపీవోను ఇతర రాష్ట్రానికి అక్రమంగా బదిలీ చేయించారని కార్మికులు అంటున్నారు. ఇదిలా ఉంటే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 350 మందికి ఉద్యోగాలు ఇచ్చారు. ఎన్నికల కోడ్ ఉండగానే పాత తేదీలు వేసి 25 మందికి ఉద్యోగాలు ఇచ్చారని స్థానికులు చెబుతున్నారు. ఏపీఎండీసీ ద్వారా ఇసుక, ముగ్గురాళ్లు తదితరాలను అక్రమంగా తరలించుకుని వైసీపీ నాయకులు కోట్లు సంపాదించుకున్నారని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. తెలంగాణా నుంచి ఏపీఎండీసీకి రూ.990 కోట్లు రావాల్సి ఉండగా దానిని ప్రభుత్వానికి జమ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. మంగంపేట ముగ్గురాళ్ల గనుల ద్వారా వచ్చిన ఆదాయం రూ.4450 కోట్లను వైసీపీ ప్రభుత్వం వాడుకుందని కార్మిక నాయకులు చెబుతున్నారు. ఇప్పటికే విజయవాడలోని ఏపీఎండీసీ ప్రధాన కార్యాలయంలో కీలక పత్రాలు మాయం చేస్తున్నారని సమాచారం రావడంతో కొత్త ప్రభుత్వం ఆ కార్యాలయానికి తాళాలు వేసిన సంగతి తెలిసిందే. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలన పూర్తవుతున్న తరుణంలో కోటి టన్నుల ముగ్గురాళ్లకు ఆఘమేఘాల మీద టెండర్‌ను పిలిచారు. వైసీపీకి చెందిన కొన్ని కంపెనీలకు మేలు చేయాలని తలంచింది. దీనిని గమనించిన పలు కార్మిక సంఘాలు, మంగంపేట స్థానికులు, టీడీపీ నాయకులు దానిని అడ్డుకున్నారు. విజిలెన్స్ నివేదికలో లోపాలు ఉంటే సీఐడీకి అక్రమాల చిట్టాను అప్పగించాలని, విజిలెన్సు నివేదికను కాపాడాలని, జరిగిన అక్రమాలపై నిజానిజాలు బయటకు తీయాలని, అక్రమార్కులపై వేటు వేయాలని కార్మిక సంఘాలు, స్థానికులు, టీడీపీ నాయకులు కోరుతున్నారు.

ఏపీఎండీసీ సీపీవో ఏమన్నారంటే..

ఏపీఎండీసీ మంగంపేట ముగ్గురాళ్ల గనుల్లో జరిగిన అక్రమాలపై ఇంకా విచారణ జరుగుతోందని సీపీవో సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మంగంపేట ప్రధాన కార్యాలయంలో ఉన్న రికార్డులు ఎక్కడికీ పోలేదని భద్రంగానే ఉన్నాయని తెలిపారు. ముగ్గురాళ్ల గనుల్లో సక్రమంగా పనులు జరుగుతున్నాయని వివరించారు. ఏ ఫైలు బయటకు పోకుండా జాగ్రత్తగా పెట్టి ఉన్నామని తెలిపారు.

గనుల్లో అక్రమాలకు తావు లేకుండా చేయాలి..



ఏపీఎండీసీ మంగంపేట గనుల్లో అక్రమాలకు తావులేకుండా చేయాలి. లాభాలను చేకూర్చే మైనింగ్‌ను ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాలి. ఏపీఎండీసీలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, జీతాలు పెంచాలని, సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని యాజమాన్యంతో పోరాటాలు చేస్తున్నా పట్టించుకోలేదు. మైనింగ్‌లో అక్రమాలు చేస్తూ సంస్థకు లాభాలు చేకూర్చిన కార్మికుల సమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం మైనింగ్‌లో అక్రమాలు జరగకుండా చేస్తూ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి.

- తుమ్మల రాధాక్రిష్ణయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, రైల్వేకోడూరు

అక్రమ సంపాదనతో వైభవంగా పెళ్లిళ్లు..

మైనింగ్‌లో అక్రమంగా సంపాదించిన డబ్బుతో ఏపీఎండీసీ ఎండీగా ఉండిన వ్యక్తి వారి ఇంట్లో పూర్వకాలంలో రాజులు కూడా చేసుకోని విధంగా వివాహాలను జరిపించారు. మంగంపేట ఏపీఎండీసీలో నిజాయితీగా పనిచేసిన వారిని ఇతర రాష్ట్రాలకు బదిలీ చేయించారు. మంగంపేట ముగ్గురాళ్ల దొంగల పని పట్టాలి. విజిలెన్స్ నివేదిక, రికార్డులు భద్రపరచడంతో పాటు అసలు నిందితులను కఠిన చర్యలు తీసుకోవాలి.

- సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు, వర్కర్స్ యూనియన్

అజ్ఞాతంలో వైసీపీ నేతలు

- క్యాడర్ ఫోన్లు చేసినా ఎత్తని వైనం
- అయోమయంలో కార్యకర్తలు
- కొందరు గోవాలో, మరికొందరు దేశాలే వదిలిపెట్టిన వైనం
- చాలామంది ఇతర రాష్ట్రాల్లో మకాం
- ప్రభుత్వం పోయినా పదవీ వ్యామోహంలో కొందరు



రైల్వేకోడూరు, జూన్ 10: అందరూ ఊహించిన విధంగా రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చింది. వైసీపీకి కోలుకోలేని స్థితి ఏర్పడింది. రాష్ట్రంలో కేవలం 11 స్థానాలు మాత్రమే వచ్చాయి. దీంతో వైసీపీ క్యాడర్ మొత్తం కనిపించని స్థితికి వచ్చింది. రైల్వేకోడూరులో ఐదోసారి పోటీ చేసిన వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొరముట్ల శ్రీనివాసులు ఓటమి పాలు కావడంతో నాయకత్వ బాధ్యతలు తీసుకున్న వారు ఈనెల 5వ తేదీ నుంచి ఫోన్లు చేసినా ఎత్తడం లేదని కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. కొందరు నేతలు విదేశాల్లో ఉండగా మరికొందరు ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. వారు ఇంతవరకు తమకు అందుబాటులోకి రాలేదని పలువురు కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు అవినీతి పనులు చేశారని అందువల్ల ఎక్కడ పట్టుకుంటారో అని భయాందోళనతో గోవా తదితర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల బెంగళూరు, హైదరాబాద్ తదితర నగరాల్లో చాలామంది వైసీపీ నేతలు తారసపడ్డా ముఖం చాటేశారని చెప్పుకుంటున్నారు. ఇక్కడ 20 ఏళ్ల ఒకరే అధికారంలో ఉండగా చేసిన పనుల వల్ల ఇప్పుడు తమ బండారం ఎక్కడ బయటపడుతుందోనన్న భయాందోళనతో ఈనెల 5 నుంచి కనిపించకుండా వెళ్లారనేది కోడూరులో ప్రధానంగా చర్చ సాగుతోంది. వైసీపీకి చెందిన కొందరు నేతలకు నామినేటెడ్ పదవులు ఉన్నాయి. వాటికి ఇంకా రాజీనామాలు చేయకుండా పదవీ వ్యామోహంతో ఇక్కడ కనిపించకుండా తిరుగుతున్నారని అందరూ చర్చించుకుంటున్నారు. పంచాయతీ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు అవినీతిలో భాగస్వామ్యం అయిన వారు పూర్తిగా కనిపించకుండా పోయారని వైసీపీ కార్యకర్తల్లో చర్చ నడుస్తోంది. కనీసం వైసీపీ కార్యాలయం వైపు కూడా నేతలు రాకుండా ఉన్నారంటే క్యాడర్ పూర్తిగా ఛిన్నాభిన్నం అయిందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

● కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 10: జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పిల్లలను కార్మికులుగా మార్చకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, ఇందుకోసం అధికారులు హోటళ్లు, పరిశ్రమలు, మెకానిక్ షాపుల్లో తరచూ తనిఖీలను నిర్వహిస్తూ బాలలను పనిలో పెట్టుకున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనెల 1 నుంచి 30వ తేదీ వరకు జిల్లాలో బాలకార్మికులను గుర్తించి వారికి రీహ్యాబిటేషన్ చేయడంతో పాటు బాలకార్మికులను పనిలో పెట్టుకున్న యాజమాన్యాలపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. చిన్న చిన్న ఫ్యాక్టరీలు, గ్రానైట్స్ తయారీ, ఇటుకల బట్టి తయారీలో బాలకార్మికులు ఉంటే వెంటనే సంబంధిత యాజమాన్యంపై కేసులు నమోదు చేయించాలన్నారు. బడిమానేసి పనులకు వెళుతున్న పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమం చేపట్టాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. 1-18 సంవత్సరాలలోపు వయసు ఉన్న పిల్లలు పూర్తి సమయం పాఠశాలల్లో ఉండే విధంగా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా బాలకార్మికుల నిర్మూలనపై కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా లేబర్ ఆఫీసర్ రంగరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, విద్యాశాఖ అధికారులు, ఎన్జీవోలు తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

బస్సులు కాదు.. గొర్రెలు వస్తున్నాయ్..

- ఒక్క బస్సు వస్తే ఒట్టు...!
- ప్రారంభించారు.. ఆచరణ మరిచారు
- ఎన్నికలకు ముందు హడావిడిగా ప్రారంభం
- ఆర్టీసీ బస్టాండుకు రాని బస్సులు
- అలంకారప్రాయంగా ఆర్టీసీ బస్టాండు



గొర్రెలకు నిలయంగా మారిన ఆర్టీసీ బస్టాండు

గుర్రంకొండ, జూన్ 10: వైసీపీ ప్రభుత్వం రూ.35 లక్షలతో నిర్మించిన ఆర్టీసీ బస్టాండు నేడు గొర్రెలకు నిలయంగా మారింది. ఎన్నికలు సమీపిస్తున్నాయని ఈ ఏడాది మార్చి 16వ తేదీ వైసీపీ నాయకులు హడావుడిగా బస్టాండును ప్రారంభించారు. అయితే పేరుకే బస్టాండు అయినా అందులో ప్రయాణికులు కూర్చునేందుకు కుర్చీలు కానీ బెంచీలు కానీ లేవు. మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం లేదు. మరి ఇక్కడికి ప్రయాణికులు ఎలా వస్తారని వైసీపీ నాయకులు ఊహించారో అర్థం కావడం లేదు. కనీస సౌకర్యాలు లేకుండా హడావుడిగా నిర్మించి ప్రారంభించిన ఈ బస్టాండు నేడు బస్సులు రాక గొర్రెలు, పశువులు, మందుబాబులకు అడ్డాగా మారింది. వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి పేరిట చేపట్టిన పనులు అలంకారప్రాయంగానే మారాయి. ఈ అభివృద్ధి పనులకు లక్షలాది రూపాయలు ప్రభుత్వ నిధులను వినియోగించి నిర్మించిన పలు కట్టడాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఈ నిర్మాణాలను కేవలం వైసీపీ నాయకులు ఆర్థికంగా ఎదగడానికే తప్ప మరో ఉద్దేశ్యంతో నిర్మించలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. కొందరు వైసీపీ నాయకులు ఈ నిర్మాణాలను కూడా తమ భూములున్న చోట నిర్మించారు. దీంతో తమ భూముల పక్కన ప్రభుత్వ కార్యాలయాలుంటే భూముల ధరలు భారీగా పెరుగుతాయన్న స్వార్థంతో అడ్డదిడ్డంగా నిర్మాణాలను చేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా గుర్రంకొండ మండలంలో పలు గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలను వైసీపీ నాయకులు తమకు సంపద సృష్టించే కేంద్రాలుగా మార్చుకున్నారని ప్రజలు పెదవి విరుస్తున్నారు.

గుర్రంకొండ పట్టణంలో కొన్నేళ్లుగా ఆర్టీసీ బస్టాండు లేదు. బస్టాండు లేకపోవడంతో పట్టణంలో ఇరుకైన రోడ్డుపైనే ఉన్న బస్టాండులో బస్సులను ఆపి ప్రయాణికులను ఎక్కించుకుని వెళుతున్నాయి. ప్రయాణీకుల కష్టాలను తెలుసుకున్న ఇక్కడి నాయకులు, విషయాన్ని అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన చొరవతో గుర్రంకొండలో ఆర్టీసీ బస్టాండు నిర్మాణానికి చిట్టిబోయినపల్లె రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబరు 29/7లో 1.36 ఎకరాలు, సర్వే నెంబరు 28/9లో 0.64 సెంట్లు స్థలాన్ని కేటాయించారు. అనంతరం ప్రభుత్వం మారిపోవడంతో అది మరుగునపడిపోయింది. ఈ రెండు ఎకరాల్లో కూడా ఎకరా స్థలం ఇతర అవసరాలకు వినియోగించేశారు. మిగిలిన స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో సుమారు దశాబ్ద కాలం ఖాళీగా ఉండేది. ఈ నేపథ్యంలో వైసీపీ నాయకులు ఆఘమేఘాలపై రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి వద్దకు వెళ్లి ఆర్టీసీ బస్టాండుకు నిధులు కేటాయించాలని కోరారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ) నుంచి రూ.35 లక్షలను కేటాయించారు. ఈ నిధులతో ఆర్టీసీ బస్టాండును కాంట్రాక్టర్లు నిర్మించారు. కేవలం మట్టి తోలి చదును చేయడంతో పాటు ఒక షెల్టర్‌ను మాత్రమే నిర్మించారు. అందులో ప్రయాణీకులు కుర్చునేందుకు కుర్చీలు, బెంచీలు లేవు. మరుగుదొడ్లు, తాగునీటి వసతి అసలే లేదు. మరి ఆ 35 లక్షలు ఎక్కడ ఖర్చు చేశారో ఆ దేవుడికే తెలియాలి.

అలంకారప్రాయంగా ఆర్టీసీ బస్టాండు

గుర్రంకొండ ఇందిరమ్మ కాలనీ ఎదురుగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండు అలంకారప్రాయంగా మారింది. ఈ ఆర్టీసీ బస్టాండును వైసీపీ నాయకులు ఈ ఏడాది మార్చి 16వ తేదీ ఆఘమేఘాలపై ఆర్భాటంగా ప్రారంభించారు. వందలాది మందితో వైసీపీ నాయకులు వచ్చి బస్టాండును తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఆర్భాటాలు చేశారు. ఆర్టీసీ బస్టాండు ప్రారంభించి దాదాపుగా మూడు నెలలు గడుస్తోంది. ఇప్పటి దాకా ఈ బస్టాండులోకి ఒక్కటంటే ఒక్క ఆర్టీసీ బస్సు వచ్చి ఆగిన సంఘటన లేదు. దీంతో బస్టాండు ప్రాంగణం గొర్రెలు, పశువులకు నిలయంగా మారింది. అంతేకాకుండా సాయంత్రం మందుబాబులకు అడ్డాగా మారింది.



గుర్రంకొండలో వైసీపీ నాయకులు ఆర్భాటంగా ప్రారంభిస్తున్న బస్టాండు (ఫైల్)

బస్టాండులో సౌకర్యాలు శూన్యం

గుర్రంకొండ పట్టణం ఇందిరమ్మ కాలనీ ఎదురుగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండులో ప్రయాణీకులకు అవసరమైన వసతులను కల్పించలేదు. కేవలం బస్టాప్‌గానే బస్టాండు ఉంది. ఈ బస్టాండులో ప్రయాణీకులు కూర్చోవడానికి బెంచీలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, కరెంట్, వెలుతురు వంటి సౌకర్యాలు కల్పించలేదు. ఈ వసతులు లేకుండా వైసీపీ నాయకులు బస్టాండును ఆర్భాటంగా ప్రారంభించడం విశేషం. దీంతో బస్టాండు ప్రారంభించినప్పటికీ బస్సుల కోసం ఎదురుచూస్తూ నిరుపయోగంగా ఉంది. అధికారులు స్పందించి బస్టాండును వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు, ప్రజలు, ప్రయాణీకులు కోరుతున్నారు.

ఆర్టీసీకి స్వాధీనం చేయలేదు..

గుర్రంకొండలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండును సంబంధిత శాఖ అధికారులకు అప్పగించాలని చూశాము. అయితే ఆర్టీసీ అధికారులు రెవెన్యూ శాఖ నుంచి భూమికి సంబంధించిన స్కెచ్‌తో పాటు స్థలం విస్తీర్ణం ఎంతుందో స్పష్టంగా తెలుపుతూ నివేదిక ఇస్తే స్థలంతో పాటు భవనాన్ని కూడా స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో ఆర్టీసీ బస్టాండును సంబంధిత శాఖకు అప్పగించలేకపోయాము.

- జావీద్, పీఆర్ ఏఈ, గుర్రంకొండ

కలెక్టరేట్‌లో ఫిర్యాదుల సందడి



కలెక్టరేట్‌లోని స్పందన హాల్ దగ్గర వేచి ఉన్న అర్జీదారులు

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 10: దాదాపు రెండు నెలల తర్వాత జిల్లా నలుమూలల నుంచి దాదాపు 100 మంది ప్రజలు ఫిర్యాదులు ఇవ్వడానికి కలెక్టరేట్‌కు వచ్చారు. గతంలో లాగానే స్పందన హాల్ దగ్గర వరుసగా కూర్చొని తమ అర్జీలు ఇవ్వడానికి సిద్ధపడ్డారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేస్తుందా, లేక స్పందన కార్యక్రమం అలాగే పెట్టి ఫిర్యాదుదారుల దగ్గర నుంచి అర్జీలు స్వీకరిస్తుందా అన్న విషయం తెలియక జిల్లా అధికారులు కొంత సమన్వయం పాటించాలని అర్జీదారులకు చెప్పి పంపినట్లు తెలిసింది. అయితే ఇక్కడికి వచ్చి న అర్జీదారుల నుంచి అర్జీలు కలెక్టర్ స్వీకరించినట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో భూఅక్రమాలు, ఇసుక దోపిడీ, మట్టి మాఫియా లాంటి విషయాలపై ఎక్కువగా అర్జీలు వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రభుత్వం గతంలో జరిగిన అక్రమాలు, ఆగడాలపై ప్రక్షాళన చేసే ప్రక్రియలో బిజీగా ఉంది. వచ్చే సోమవారానికి గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేస్తారా లేదా అనేది తెలుస్తుందని జిల్లా అధికారులు వెల్లడించారు.

రాజీనామాపై డీసీసీబీ చైర్‌పర్సన్ మడతపేచీ

- చీఫ్ సెక్రటరీ ఆదేశాలు తమకు వర్తించవట..!
- ఆప్కాబ్‌కు జీవో రావాలంటూ కాలయాపన
- ఇతర జిల్లాల్లో చైర్మన్ల రాజీనామా

కడప(రూరల్), జూన్ 10: రాష్ట్రంలో వైసీపీ చిత్తుచిత్తుగా ఓడిపోయింది. ఎన్డీయే కూటమి అఖండ మెజార్టీతో గెలుపొందింది. దీంతో ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బుధవారం ప్రమాణస్వీకారం చేసి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముందుగానే గత ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి స్థానంలో నీరబ్ కుమార్ ప్రసాద్‌ను నియమించారు. ఆయన బాధ్యతలు చేపట్టిన తదనంతరం.. ప్రభుత్వ, ప్రభుత్వేతర అనుబంధ సంస్థలకు గత వైసీపీ ప్రభుత్వం కట్టబెట్టిన నామినేటెడ్ పదవులకు రాజీనామా చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఇతర జిల్లాల్లోని కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ల పదవులకు రాజీనామాలు చేస్తున్నారు. అయితే మాజీ సీఎం జగన్ సొంత జిల్లాలోని కడప కేంద్ర సహకార బ్యాంకు చైర్‌పర్సన్‌గా ఉంటున్న మల్లెల ఝాన్సీరాణి మాత్రం ఇప్పటి వరకు రాజీనామా చేయలేదు. తాను అటు ఆప్కాబ్‌కు ఇటు డీసీసీబీకి చైర్‌పర్సన్‌గా ఉన్నానని ఈ నేపథ్యంలో ఆప్కాబ్‌కు మొదటగా రాజీనామా చేసిన తరువాతనే డీసీసీబీ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయాలన్నారు. కానీ ఇంతవరకు ఆప్కాబ్ చైర్‌పర్సన్ పదవి రాజీనామా చేయాలంటూ జీవో రాలేదని అందుకే కొనసాగుతున్నట్లు ఆమె చెప్పుకొస్తున్నారు. ఈ వ్యవహారంపై ఆంధ్రజ్యోతి ఝాన్సీరాణీని వివరణ కోరగా.. ఆప్కాబ్‌కు జీవో వచ్చిన తరువాతనే రాజీనామా చేయాల్సి ఉందని ఆ తరువాతనే డీసీసీబీ పదవికి రాజీనామా ఉంటుందని, అంతవరకు డీసీసీబీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతానని స్పష్టం చేశారు.



ఫైళ్లపై చకచకా సంతకాలు?

డీసీసీబీ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి సోమవారం కడప డీసీసీబీ కార్యాలయానికి వచ్చినట్లు అక్కడి అధికారులు పేర్కొంటున్నారు. అనుకూలమైన ఫైళ్లపై పాత తేదీలు వేసి చకచకా సంతకాలు చేసినట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వానికి అంటిపెట్టుకొని ఉండి అడుగులకు మడుగులు వత్తిన వారికి మేళ్లు, ప్రయోజనాలు కల్పిస్తూ ఫైళ్లపై పాత తేదీలు వేసి సంతకాలు చేసి కదిలించినట్లు సమాచారం. డీసీసీబీలో పనిచేస్తున్న పలువురు అధికారులు, ఉద్యోగులు వైసీపీ సానుభూతి పరులు కావడంతో ఈ వ్యవహారాన్ని దగ్గరుండి నడిపించి బయటికి పొక్కనీయకుండా ఉంచినట్లు తెలిసింది.

పూర్తయ్యేదెన్నడు!

● అసంపూర్తిగా అదనపు తరగతి గదుల నిర్మాణం ● 13న ప్రారంభం కానున్న పాఠశాలలు



పోరుమామిళ్ల జిల్లా పరిషత్ హైస్కూలులో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

పోరుమామిళ్ల, జూన్ 10 : గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంత పాఠశాల్లో మౌలిక వసతులు, అదనపు తరగతి గదుల కోసం నిధులు కేటాయించి దాదాపు రెండు సంవత్సరాలకు పైగా అవుతోంది. విడతల వారీగా నిధులు కేటాయించడం, సాంకేతిక సమస్యల కారణంగా పూర్తి స్థాయిలో నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో 13న పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు అందుతాయా లేదా అన్నది ప్రధాన సమస్యగా మారింది. గతంలో మండలానికి సంబంధించి నాడు నేడు పథకం కింద 38 పాఠశాలల



పైకప్పు స్థాయిలో నిలచిపోయిన పాఠశాల భవన నిర్మాణం

భవనాలకు మరమ్మతులకు మరో 10 అదనపు భవన నిర్మాణాలకు మొత్తం 14 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి విద్యాకమిటీ ఛైర్మన్లను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులను భాగస్వామ్యం చేసింది. కానీ విడతల వారీగా బిల్లులు చెల్లించడంతో ఇప్పటికీ కూడా పూర్తిస్థాయిలో తరగతి గదుల నిర్మాణానికి నోచుకోలేదు. పోరుమామిళ్లకు సంబంధించి జిల్లా పరిషత్ హైస్కూలు, ఉర్దూ మెయిన్ స్కూలు కాపువీధి, 15వ వార్డు అంగన్వాడీ కేంద్రాలకు నిధులు మంజూరయ్యాయి. కానీ జిల్లా పరిషత్ హైస్కూలుకు సంబంధించి ఇంకా పూర్తి కావాల్సిన పనులే ఉన్నాయి. రంగసముద్రం పంచాయతీలో కమ్మవారిపల్లె, ఎస్సీ కాలనీ, గిరినగర్ ఎస్టీ కాలనీకి మరమ్మతులు మాత్రం పూర్తయ్యాయి. కస్తూర్బా జూనియర్ బాలికల కళాశాలకు సంబంధించి రెండు అదనపు తరగతి గదులకు స్లాబులు వేయాల్సి ఉంది. దమ్మనపల్లె పంచాయతీలోని ఈదుళ్లపల్లె లో మరమ్మతులు చేశారు. కొండిపాటిపల్లె పంచాయతీకి సంబంధించి ఇందిరానగర్లో కిచెన్షెడ్డు పెండింగ్లో ఉంది. వెంకటాపురం జిల్లా పరిషత్ హైస్కూలుకు సంబంధించి రెండు అదనపు తరగతి గదులకు నిధులు మంజూరు కాగా, ఒకటి ప్రారంభానికి నోచుకోలేదు. మరొకటి గ్రౌండ్ లెవల్లోనే మిగిలిపోయింది. కవలకుంట్ల ఎస్సీ కాలనీలో కిచెన్షెడ్డు పెండింగ్లో ఉంది. టేకూరుపేట జిల్లాపరిషత్ హైస్కూలులో అదనపు తరగతి గదులకు సుమారు కోటి నిధులు మంజూరైనా పనులు మాత్రం గ్రౌండ్ లెవల్లో ఉండిపోయాయి. సిద్దవరం జిల్లా పరిషత్లో అదనపు తరగతి గదికి సంబంధించి పెన్సింగ్ వర్క్ జరగాల్సి ఉంది.గానుగపెంట జిల్లా పరిషత్ హైస్కూలుకు మరమ్మతులు పూర్తయ్యాయి కానీ వీటికి మూడు అదనపు తరగతి గదులకు 40 లక్షలు నిధులు మంజూరైనా అవి ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. మొత్తం 38 స్కూళ్ల మరమ్మతులు సంబంధించి దాదాపు 85 శాతం పూర్తయింది. సిద్దవరం గ్రామంలో స్కూలుకు స్లాబు వేయాల్సి ఉంది. మరమ్మతులు అయితే దాదాపు పూర్తి కావస్తున్నా అదనపు తరగతి గదుల నిర్మాణం మాత్రం నిర్మాణానికి నోచుకోక అలాగే ఉండిపోయాయి. మరి ఇవి ఎప్పుడు నిర్మాణానికి నోచుకుంటాయో ఎప్పుడు పూర్తవుతాయో విద్యార్థులకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తారో వేచి చూడాల్సిందే. ఈ విషయమై ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఓబయ్యను వివరణ కోరగా, పోరుమామిళ్ల మండలానికి సంబంధించి మరో పాఠశాల మరమ్మతులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయన్నారు. పర్నీచర్స్ కూడా వచ్చాయని, 9 అదనపు తరగతి గదుల నిర్మాణం పెండింగ్లో ఉందన్నారు. ఇంకా ఇప్పటి వరకు జరిగిన పనులకు 58 లక్షలు గ్రాంటు ఉందని, ఆ పనులు కూడా త్వరగా పూర్తిచేస్తామన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి మృతి

సుండుపల్లె, జూన్ 10: ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి సుండుపల్లె మండలంలోని మడుంపాడు క్రాస్కు కూతవేటు దూరంలో అదే గ్రామానికి చెందిన రెడ్డెయ్య రామలింగయ్య (55) బైక్పై వెళుతుండగా, ఎదురుగా బైక్పై వస్తున్న పెద్దపల్లికి చెందిన నరేశ్ ఢీకొన్నాడు. ఈ సంఘటనలో రామలింగయ్య మృతి చెందగా, మిగిలిన ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనం

విద్యుదాఘాతంతో జెర్సీ ఆవు..

గాలివీడు, జూన్ 10: మండలంలోని వీమలచెరువు పల్లె పంచాయతీ కొత్తపల్లిమండపల్లెలో దుద్దేకుల మో హనరెడ్డికి జెర్సీ ఆవు విద్యుదాఘా తంతో మృతి చెందింది. సోమవారం ఆవును పొలంలో మేతకు వదలగా ట్రాన్స్ఫార్మర్ దగ్గర తీగను తగులు కుని మృతి చెందిందని బాధితుడు తెలిపాడు. 90 వేలు విలువ చేసే ఆవు మృతి చెందడంతో తమ జీవనాధారం కోల్పోయినట్లు వివరించాడు.



ఆవు మృతకళేబరం

గుండెపోటుతో టీడీపీ నేత..

జమ్మలమడుగు, జూన్ 10: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని నారాపురం వెంకటేశ్వరస్వామి ఆలయానికి సమీపంలో నివాసముంటున్న టీడీపీ మైనార్టీ నేత బాషామొహిద్దీన్ (76) ఆదివారం రాత్రి మృతిచెందారు. టీడీపీ ఆవిర్భావం పొన్నపురెడ్డి శివారెడ్డి, రామసుబ్బారెడ్డి వెంట ఉండి టీడీపీకి సేవ చేశారు. కాంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం రాత్రి హార్ట్ఎటాక్తో మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, పలువురు నేతలు సోమవారం ఉదయాన్నే మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పొన్నపురెడ్డి గిరిధర్రెడ్డి, కొమెర్లమోహన్, జె.మున్నా, వంగల నాగేంద్రయాదవ్, చిన్నపసుపుల శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మృతదేహాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి

ట్రాన్స్ఫార్మర్ల చోరీలతో రైతుల బెంబేలు

జమ్మలమడుగు, జూన్ 10: ట్రాన్స్ఫార్మర్ల చోరీలు అధికం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైలవరం మండలంలోని పొన్నంపల్లె, తొర్రివేముల, గుగులనారాయణపల్లె, తదితర గ్రామాల్లో రైతుల ట్రాన్స్ఫార్మర్ల చోరీలు జరిగాయి. తాజాగా సర్వేనంబరు 317, 318 లోని మూరబోయిన పెద్దరెడ్డెయ్యకు చెందిన పొలంలో ఏర్పాటు చేసి ట్రాన్స్ఫార్మర్ చోరీ కావడంతో ఏఈ పీతాంబర్రెడ్డికి ఫిర్యాదు చేశాడు. ఒక్కొక్క ట్రాన్స్ఫార్మర్కు పర్చాటుకు రూ.70 వేలు ఖర్చు అవుతుందని బాధితుడు తెలిపాడు. ఇటీవల మైలవరం మండలంలో వరుసగా 11 ట్రాన్స్ఫార్మర్ల చోరీకి గురయ్యాయని రైతులు అంటున్నారు. ఈ విషయమై ఏఈ పీతాంబర్రెడ్డిని వివరణ కోరగా ట్రాన్స్ఫార్మర్ల చోరీపై ఫిర్యాదులు అందాయని, ఇప్పటికి 8 కేసులు నమోదు చేశామని, తాము కూడా పోలీసు వారికి సమాచారం అందించామన్నారు. కాగా, ట్రాన్స్ఫార్మర్ల చోరీకి సంబంధించి కొంతమందిని పెద్దముడియం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

కారు, ద్విచక్ర వాహనం ఢీ- ఒకరు దుర్మరణం

చిన్నమండెం, జూన్ 10: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో వెంకట్రమణ (36) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ రమేశ్బాబు తెలిపారు. వండాడి గ్రామ పంచాయతీ తుర్పుపల్లె హరిజనవాడకు చెందిన వెంకట్రమణ బోర్వెల్లో పనిచేస్తుంటాడు. సోమవారం రాయచోటినుంచి బైక్పై వస్తుండగా తుర్పుపల్లె హరిజనవాడ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అతనిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి భార్య వండాడి కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వేంపల్లె - రాయచోటి రోడ్డును పూర్తి చేయండి

వేంపల్లె, జూన్ 10 : పెండింగ్లో ఉన్న వేంపల్లె - రాయచోటి రోడ్డును ఈ ప్రభుత్వమైనా పూర్తి చేయాలని పీసీసీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. వేంపల్లెలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేంపల్లె నుంచి రాయచోటి వరకు గతంలో రోడ్డు పనులు చేపట్టి నిలిపివేశారని దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రోడ్డు పనులు ముందుకు సాగలేదని వేంపల్లె నుంచి రాయచోటికి రెండు గంటలు సమయం పడుతుందన్నారు. ఆ దారిలో ప్రయాణం చేయడం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయని అభిప్రాయపడ్డారు. సంక్షేమం కోసం కృషి చేస్తామని చెబుతున్న టీడీపీ ప్రభుత్వం వెంటనే పనులు చేపట్టి పూర్తి చేయాలని కోరారు.

పద్మభూషణ్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప (నాగరాజుపేట), జూన్ 10 : 2025 సంవత్సరానికి గాను పద్మభూషణ్, పద్మవిభూషణ్ మరియు పద్మశ్రీ అవార్డుల కోసం సామాజిక సేవా సంస్థల నుంచి అర్హులైనఅభ్యర్థుల దరఖాస్తు చేసుకోవాలని కడప సెట్ప్ ముఖ్యకార్యనిర్వహణాధికారి సాయిగ్రేస్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను హెచ్టీటీపీ//అవార్డ్స్.జీఓవి.ఇన్ వెబ్సైట్లో నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. దరఖాస్తు చేసిన కాపీలను జూలై 15 లోపు పోస్టు ద్వారా కానీ, నేరుగా కానీ కడప సెట్ప్ కార్యాలయానికి చేర్పవలసిందిగా ఆమె తెలిపారు. ఇతర వివరాలకు 9949298810, 9849497045లను సంప్రదించాలని కోరారు.

గంగమ్మ గుడి హుండీ ఆదాయం రూ.1.94 లక్షలు

సిద్దవటం, జూన్ 10: చింతకొమ్మదిన్నె మండలం కొత్తపేట గంగమ్మగుడికి హుండీ ద్వారా రూ.1,94,097 ఆదా యం వచ్చినట్లు ఈవో సురేష్కుమార్రెడ్డి తెలిపారు. గంగమ్మ ఆలయంలో అధికారులు, భక్తుల సమక్షంలో సోమవారం హుండీలను తెరిచి లెక్కించగా వచ్చిన మొత్తాన్ని దేవస్థానం పేరుతో బ్యాంకులో జమ చేస్తామ న్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇనిస్పెక్టర్ జనార్దన్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మోటారు వాహనాలకు థర్డ్ పార్టీ బీమా తప్పనిసరి

సిద్దవటం, జూన్ 10: మోటారు వాహనాలకు థర్డ్ పార్టీ బీమా తప్పనిసరిగా తీసుకోవాలని రవాణా శాఖ ఉపకమిషనర్ మీరాప్రసాద్ సూచించారు. 2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాలను 50 శాతం తగ్గించాలని నిబద్ధతతో భారత ప్రభుత్వం రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టిసారించడంతోపాటు, తగిన చర్యలు చేపడుతోందన్నారు. మోటారు వాహనాల చట్టం 1988 సెక్షన్ 146 ప్రకారం చెల్లుబాటు అయ్యే బీమా లేకుండా ఎటువంటి మోటారు వాహనాలను ఉపయోగించకూడదని భారత ప్రభుత్వం తెలియజేసిందన్నారు. అదే విధంగా 1985 మోటారు వాహనాల చట్టం సెక్షన్ 196 ప్రకారం బీమా లేని వాహనాలను నడిపినందుకు చట్టప్రకారం శిక్షలు విధిస్తామన్నారు. మొదటి నేరం కింద మూడు నెలలు జైలు శిక్ష, లేదా రూ.2 వేల జరిమానా, రెండూ కూడా విధించవచ్చన్నారు. రెండవ సారి అదే నేరం చేస్తే మూడు నెలల వరకు జైలు శిక్ష, రూ.4 వేల జరిమానా లేదా రెండు కూడా విధించే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. కడపజిల్లాలోని వాహనదారులు 2024 ఏప్రిల్ నుంచి థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని, అలా లేకుండా ఇష్టం వచ్చినట్లు వాహనాలు తిప్పితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు రవాణాశాఖ అధికారులకు సహకరించాలని ఉపకమిషనర్ తెలిపారు.

అంగళ్లులో ఒంటె అపహరణ

కురబలకోట, జూన్ 10: బక్రీద్ పండుగ సందర్భంగా ఖుర్బానీ కోసం తెచ్చిన ఒంటె అపహరణకు గురైన సం ఘటన మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు మండలంలోని అంగళ్లు పంచాయతీ పోరెడ్డివారి పల్లెకు చెందిన ఏడుగురు కలసి బక్రీద్ పండుగ సందర్భంగా ఖుర్బానీ ఇవ్వడానికి 15 రోజుల క్రితం ఒంటెను కొనుగోలు చేసి ఇంటి ముందు కట్టేశారు. సోమవారం తెల్లవారే సరికి ఒంటె కనిపించకపోవడంతో ఆందోళనకు గురై చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఒంటెను శనివారం అర్ధరాత్రి దుండగులు అపహరించారు. కాగా, కొనుగోలుదారులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దక్కపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు పట్టణంలోని పలుచోట్ల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా, ముగ్గురు వ్యక్తులు ఒంటెను స్కూటర్కు కట్టుకుని మదనపల్లె వైపు తీసు కెళ్ళిన దృశ్యాలు కనిపించాయి. కాగా ఒంటె ఆచూకీ అందించిన వారికి రూ.20వేలు పారితోషకం అందిస్తామని బాధితులు తెలిపారు.

పక్కాగా ఇసుక అక్రమ రవాణా..

● ఇష్టానుసారంగా తరలింపు

● అడ్డుకునే వారెవరంటూ దబాయింపు

చెన్నూరు, జూన్ 10 : చెన్నూరు - కొండపేట మధ్య పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. స్థానిక పోలీసుస్టేషన్కు ముడుపులు అందుతున్నాయని, అందుకే.. అక్రమ రవాణా జోరందుకుందని విమర్శలు వస్తున్నాయి. రాత్రి కాగానే పెన్నాకు వరద నీరు వచ్చినా, దీనిని వదిలేసి కొండపేట వైపు నుంచి దాదాపు 20 ట్రాక్టర్లు ఇసుక కోసం నదిలో దిగుతున్నాయి. ఈ ట్రాక్టర్లు పోలీసుస్టేషన్ ముందునుంచే వెళుతున్నా పోలీసులు కానీ, రెవెన్యూ కానీ ఏమి పట్టించుకోకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. పోటీలు పడి కడప నగరానికి ఇసుక తరలిస్తున్నారు. ఒక్కో ట్రిప్పుకు 3 వేల నుంచి 4వేల వరకు ధర పలుకుతుండడంతో మంచి ఆదాయమార్గంగా మారింది. పైగా ఒకరికొకరు సమాచారం అందించుకుంటూ పార్టీలకతీతంగా ఇసుక తరలిస్తున్నారు. ముఖ్యంగా వైసీపీలో ఉన్న వారే ఇసుక అక్రమరవాణాకు బీజం వేశారు. ఇసుక తరలింపులో అందరూ ఒక ప్రణాళిక ప్రకారం వ్యవహరిస్తున్నారు. పొద్దుగూకగానే ఎక్స్కవేటర్లు నదిలోకి దింపడం, దారులు ఏర్పాటు చేయడం వంటి వారిగా నిర్వహిస్తూ ఇసుక నిల్వలను కొల్లగొడుతున్నారు. కొండపేట క్రాస్ రోడ్డు, చెన్నూరు కొత్తరోడ్డు, గోసుల కళ్యాణమండపం, ఇర్ఫాన్ నర్సింగ్ వద్ద నాలుగు బ్యాచ్లు ఏర్పాటు చేసుకుని ఎలాంటి ఆవాంతరం లేకుండా ఇసుక అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఈవిషయమై ఇటీవల పత్రికల్లో వచ్చినా ఖాతరు చేయడం లేదు. రెవెన్యూ సిబ్బంది సైతం జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మూడు నెలలుగా ఈ వ్యవహారం జోరుగా కొనసాగుతున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకోకపోతే పెన్నా పూర్తిగా ఎండిపోక తప్పదు.

నేడు, రేపు ఎంజేఆర్ కళాశాలలో మెగా జాబ్ మేళా

పీలేరు, జూన్ 10: పీలేరులోని ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నేడు, రేపు మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఛైర్మన్ ఎంపీ అవినాశ్రెడ్డి తెలిపారు. మేజిక్ బస్ ఫౌండేషన్ సేవా సంస్థ వారి సౌజన్యంతో రెండు రోజులపాటు జరుగున్న జాబ్ మేళాలో 50కి పైగా కంపెనీలు పాల్గొంటాయని, సుమారు వేయి ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు పూర్తి చేసిన వారందరూ జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హులని వివరించారు. జాబ్ మేళాలో టెక్ మహీంద్రా, ట్రెండ్స్ ఇన్ఫర్మేషన్, జీఎస్ఎస్ గ్లోబల్, 24/7 ఏఐ, రిపోర్ట్-ఈడీ, సాథర్లాండ్, టీం లీజ్, ఈటీఎస్ గ్లోబ్, క్వెస్ కార్ప్, అపోలో, ప్యూచర్ సి ఎక్స్ యంగ్ మైండ్స్, గ్రీన్ ట్రీన్స్ కాలిబర్ హెచ్ఆర్, ఎయిర్టెల్ తదితర కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే తమ కళాశాలలో టీసీఎస్, ఆక్సెంచర్, డెల్లా ఎక్స్, ఆల్ఫా టెక్నాలజీస్, సూర్య టెక్ తదితర 30కి పైగా కంపెనీలు ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. తమ కళాశాలలో చదివిన ప్రతి విద్యార్థికీ ఉద్యోగ అవకాశం కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. మేజిక్ బస్ ఫౌండేషన్ ఇండియా ప్రతినిధి వెంకట మాట్లాడుతూ రెండు రోజుల జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఏడాదికి రూ.5.50 లక్షల వేతనం ఉంటుందని తెలిపారు. పీలేరు పరిసర ప్రాంత నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మార్కెట్ పేరు మారుస్తారా? మార్చాలా?

● పాలక మండలి నిర్ణయం తీసుకోవాలి

● ప్రజల మనోభావాల మేరకే కూటమి నిర్ణయాలు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూదన్రెడ్డి

పులివెందుల టౌన్, జూన్ 10: పట్టణంలో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన రంగనాథస్వామి ఆలయం సమీపంలో ఏర్పాటుచేసిన కూరగాయల మార్కెట్కు శ్రీ రంగనాథ స్వామి కూరగాయల మార్కెట్గా పేరు నామకరణం చేస్తారా.. లేక మేమే చేయమంటారా అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూదనరెడ్డి పులివెందుల మున్సిపల్ పాలక మండలిని ప్రశ్నించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ఆర్ సీఎంగా ఉన్న సమయంలో నిర్మించిన ఈ కూరగాయల మార్కెట్ను రంగనాథస్వామి కూరగాయల మార్కెట్గా పిలిచేవారన్నారు. జగన్మోహన్రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత హిందూ మనోభావాలను దెబ్బతీసేలా వైఎస్ఆర్ కూరగాయల మార్కెట్గా పేరు మార్చారని, దీనిపై భారతీయ జనతా పార్టీ, హిందూ పరిషత్ వేదికతో కలసి అభ్యంతరం వ్యక్తం చేస్తూ గతంలో మున్సిపల్ కమిషనరుకు వినతిపత్రం కూడా అందించామన్నారు. ఈ కూరగాయల మార్కెట్ పేరును మారుస్తున్నట్లు మున్సిపల్ పాలక మండలి సమావేశం తీర్మానం చేయాలని, లేకుంటే కూటమి ఆధ్వర్యంలో అధికారికంగా పేరు మార్పేలా చేస్తామన్నారు. మన పులివెందుల ప్రాచీనత ప్రాధాన్యతను తెలిపే శ్రీరంగనాథస్వామి పేరును పెట్టాలని దీనిపై గతంలో ధర్నాలు, ర్యాలీలు కూడా చేయడం జరిగింది. అప్పుడు అధికారులు కచ్చితంగా మారుస్తామని చెప్పారన్నారు. కానీ కూరగాయల మార్కెట్ పేరును వైఎస్ఆర్ మార్కెట్గానే ఉంచడం జరిగిందని, త్వరితగతిన పులివెందుల మున్సిపల్ అధికారులు కౌన్సిల్లో చర్చించుకుని కచ్చితంగా పేరు మార్చాలని లేనిపక్షంలో కూరగాయల మార్కెట్ పేరును రంగనాథస్వామి కూరగాయల మార్కెట్గా తామే మారుస్తామని హెచ్చరించారు. ప్రజా అభిప్రాయం మేరకు పేర్లు ఉండాలని కానీ, పార్టీలకు వ్యక్తులకు అనుకూలమైన పేర్లు ఉండరాదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. కొంత మంది పులివెందులలోని నాయకులు వారి స్వార్థ ప్రయోజనాలు, అధిష్టానం మెప్పు కోసం రంగనాథస్వామి కూరగాయల మార్కెట్ను వైఎస్ఆర్ కూరగాయల మార్కెట్గా మార్చారన్నారు. ఇకపై ఆలాంటివి సాగవన్నారు.

ప్రతిపాదనలకే పరిమితమైన వంతెన

పెద్దమండ్యం, జూన్ 10: పెద్దమండ్యం- గుర్రంకొండ రహదారి పెద్దమండ్యం సమీపంలో కుషావతినదిపై బ్రిడ్జి నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. దశాబ్దాల క్రితం పెద్దమండ్యం- గుర్రంకొండ రహదారి డబుల్ తారురోడ్డు పూర్తైనాని. రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా జరగాల్సిన బ్రిడ్జి నిర్మాణం జాప్యం జరిగింది. తారురోడ్డు నిర్మాణ సమయంలో తుపాన్ తాకిడికి ఉధృతంగా ప్రవహిస్తున్న కుషావతి ప్రవాహంలో జీపు కొట్టుకుపోయి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ఐదుగురిలో నలుగురు ప్రాణాపాయస్థితి నుంచి బయట పడగా ఒకరు మృతి చెందారు. అప్పుడు కుషావతినదిపై భారీ బ్రిడ్జి నిర్మాణానికి ఆర్అండ్బీ ప్రతిపాదన చేసినట్లు అధికారులు తెలిపారు. ఏళ్లు గడుస్తున్నా బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి ఏడాది వర్షాకాలంలో ఈ మార్గంలో ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా జిల్లా అధికారులు చర్యలు తీసుకుని కుషావతిపై త్వరలో బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



కుషావతినది ప్రవాహానికి ప్రయాణికుల కష్టాలు (పైల్ఫోటో)

పెద్దమండ్యం కుషావతినదిపై బ్రిడ్జి నిర్మాణ అభివృద్ధి పనులకు ఇటీవల రూ. 4 కోట్లు అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపినట్లు ఆర్అండ్బీ ఏఈ శ్రీనివాసులు తెలిపారు.

పశువైద్య మండలి ఎన్నికల్లో డాక్టర్ గీతాప్రియ గెలుపు



కడప(రూరల్) జూన్ 10 : భారత పశువైద్య పట్టభద్రుల మండలికి 2024 జూన్ 8న నిర్వహించిన ఎన్నికల్లో కడప జిల్లా పశు సంవర్థకశాఖ పరిధిలో పనిచేస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ గీతా ప్రియ ప్రత్యర్థిపై 12,999 ఓట్లతో రెండవ అతిపెద్ద మెజార్టీ విజయం సాధించారు. డాక్టర్ ఉమేష్ చంద్రవర్మ ప్యానల్లో డాక్టర్ గీతాప్రియతో పాటు 11 మంది సభ్యులు గెలుపొందారు. ఈ పోటీలో దేశవ్యాప్తంగా 93 మంది బరిలో నిలిచారు. ఈ సందర్భంగా డాక్టర్ గీతాప్రియ మాట్లాడుతూ తనకు పున విజయాన్ని అందించిన తెలుగు రాష్ట్రాల పశువైద్యులకు కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు. పశువైద్యుల శ్రేయస్సు, పశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం తమ వంతు చర్యలు చేపడతామన్నారు. పశువైద్య పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి, పశువుల ఆసుపత్రులలో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషిచేస్తానని తెలియజేశారు.

జడ్పీ ప్రావిడెంట్ ఫండు పట్టికలు ఆన్లైన్లో అప్లోడ్

● జడ్పీ సీఈవో సుధాకర్రెడ్డి

కడప(రూరల్) జూన్ 10 : జిల్లా పరిషత్తు 2022-23 సంవత్సరం ప్రావిడెంట్ ఫండ్ సాంవత్సరిక పట్టికలను ఆన్లైన్లో అప్లోడ్ చేసినట్లు జడ్పీ సీఈవో ఎం.సుధాకర్రెడ్డి తెలిపారు. కడప జడ్పీ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు వాటిని సరిచూసుకుని, అభ్యంతరాలుంటే తగు రుజువులతో జిల్లా పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఒక నెలలోపు అందిన అభ్యంతరాలను మాత్రమే సవరించుటకు అనుమతిస్తామన్నారు.

కర్ణాటక బీర్లు స్వాధీనం.. విక్రేత అరెస్టు

మదనపల్లె టౌన్, జూన్ 10: కర్ణాటక బీర్లు విక్రయిస్తున్న మహిళను ఎస్ఈబీ పోలీసులు అరెస్టు చేసి 9 కర్ణాటక బీరుబాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ రమేశ్రెడ్డి తెలిపారు. సోమవారం మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని కురబలకోట మండలం అప్పినాయనిపల్లెకు చెందిన కృష్ణప్ప భార్య బి.మల్లిక(37) కర్ణాటక బీర్లు విక్రయిస్తుండగా అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 9 కర్ణాటక బీరుబాటిళ్లు స్వాధీనం చేసుకుని రిమాండుకు పంపామన్నారు. నాటుసారా అక్రమరవాణా, విక్రయాలు, కర్ణాటక మద్యం, గంజాయి విక్రయిస్తున్న వారిపై నిఘా పెట్టామని, చట్టాన్ని ఉల్లంఘిస్తే అరెస్టు చేస్తామని సీఐ చెప్పారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నిమ్మనపల్లి, జూన్ 10: కుటుంబ సమస్యల కారణంగా ఓ వివాహిత విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్ఐ లోకేష్రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాచ వేదికల్లపల్లి పంచాయతీ గొల్లపల్లెకు చెందిన అశ్విని(23) ఇంట్లో సమస్యల కారణంగా పురుగుమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా వెంటనే కుటుంబీకులు గమనించి ఆమెను మదన పల్లె ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. దీంతో ఆస్పిని కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవోపేతం వీరభద్రుడి పల్లకీ ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, వీరభద్రస్వామి ఉత్సవ విగ్రహాలు

రాయచోటిటౌన్, జూన్ 10: దక్షిణకాశీగా పేరుగాంచిన రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకీ ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో రమణారెడ్డిల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రోచ్చారణల మధ్య భద్రకాళీ సమేత వీరభద్రుడు ఉత్సవ విగ్రహాలను అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పల్లకీ ఉత్సవంపై ఆలయం చుట్టూ మాడవీధుల్లో ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అర్చక స్వాములు ఆలయానికి వచ్చిన భక్తులందరికీ అర్చనలు చేసి తీర్థప్రసాదాలు అందించారు.

గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు

● ఎస్ఐ రమేశ్‌బాబు



కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న ఇంటలిజెన్స్ అధికారులు

చిన్నమండెం, జూన్ 10: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జరిగిన అల్లర్ల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘానికి ఇంటిలిజెన్స్ వారు కౌంటింగ్ అయిపోయిన తరువాత కూడా అల్లర్లు జరుగుతాయని హెచ్చరించడంతో ఎన్నికల సంఘం ఆదేశాలతో మండలంలోని కలిబండ, నాగూరువాండ్లపల్లె, శ్రీనివాసపురం, బోరెడ్డిగారిపల్లె గ్రామాల్లో కేంద్ర బలగాలతో విజుబుల్ పోలీసింగ్ నిర్వహించినట్లు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి రాజకీయ ఘర్షణలు జరగకుండా ఈ కవాతు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో ఘర్షణలకు దిగితే కేసులతో పడే ఇబ్బందుల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బలగాలతో పాటు స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

సిబ్బందిని విచారించిన డీపీఎంవో



పీహెచ్‌సీలో విచారిస్తున్న డీపీఎంవో

రాయచోటిటౌన్, జూన్ 10: జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని వాల్మీకి స్ట్రీట్ పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బందిపై సోమవారం జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి (డీపీఎంవో) డాక్టర్ రియాజ్‌బేగ్, డీఎన్ఎంవో డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డిలు విచారణ చేశారు. ఇటీవల ఏఎన్ఎం వేధింపులు భరించలేక ఆశావర్కర్ చిట్టెమ్మ వాస్మోల్ తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ విషయంపై వారు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు పీహెచ్‌సీలోకి వెళ్లి విధి నిర్వహణలో పర్యవేక్షకులు, ఏఎన్ఎంలపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేశారు. సాధారణ విధి నిర్వహణలో వారు నిర్వర్తించిన విధులకు సంబంధించిన దస్త్రాలు పరిశీలించారు. అలాగే విడివిడిగా వారితో మాట్లాడి వారి సంజాయిషీలను నమోదు చేసి సంబంధించిన వైద్యాధికారి డాక్టర్ కీర్తి అభిప్రాయం కూడా తీసుకున్నారు. డీఎంహెచ్‌వోకు తదుపరి చర్యల నిమిత్తం సమర్పించనున్నట్లు డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్ తెలిపారు.

మహాభారత యజ్ఞం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

రామాపురం,జూన్ 10: ధర్మానికి, అధర్మానికి జరిగిన మహాఘట్టమే మహాభారత యజ్ఞం అని ఎమ్మెల్యే రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం మండలంలోని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాభారత యజ్ఞానికి ముఖ్య ఆహ్వానితుడిగా విచ్చేసి పంచపాండవుల, ద్రౌపతి విగ్రహాలకు పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వరుసగా మహాభారత యజ్ఞం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనందంగా ఉందని, మహాభారతాన్ని విన్నా, చదివినా ఎంతో పుణ్యకార్యమని ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో స్థల దాత అయోధ్యాపురం శ్రీనివాసులరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భువనేశ్వరిని కలిసిన నేతలు

ఓబులవారిపల్లె, జూన్ 10: రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీధర్, ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డిలు విజయవాడలో సోమవారం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి కలిసి శాలువాతో సత్కరించారు. అలాగే టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు తాతంశెట్టి నాగేంద్ర, పార్టీ రాయలసీమ కన్వీనర్లు జోగినేని మణి, వెంకటేష్, చంద్రశేఖర్, చిట్వేలి టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితేగానీ పట్టించుకోరా...!

● ఆందోళనలో వాహనదారులు



బ్రిడ్జి కింది భాగం పూర్తిగా విరిగిపోయిన దృశ్యం



పూర్తిగా దెబ్బతిన్న సిద్దారెడ్డిపల్లె బ్రిడ్జికింద భాగం

చిట్వేలి, జూన్ 10: మండలంలో లోలెవెల్ బ్రిడ్జిల పరిస్థితి దారుణంగా వుంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. భారీ వాహనాలు అటుగా వెళ్తే పరిస్థితి ఏమిటోనని వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. దీంతో ప్రమాదాలు జరిగితే గానీ పట్టించుకోరా అని వాహనదారులు అధికారులపై విమర్శలు చేస్తున్నారు. చిట్వేలి -కోడూరు మార్గంలో అనునిత్యం వాహనాలు రాకపోకలు అధికంగా వుంటాయి. ఎన్నో ప్రమాదాలకు గురై గాయాలపాలైన కొందరు, కొందరు మృత్యువాత పడి చనిపోయిన వారూ వున్నారు. గత 20 సంవత్సరాల నుంచి రహదారి కోసం ప్రజలు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకునే వారే లేరు. పత్రికల్లో కూడా కథనాలు వస్తున్నా ఫలితం దక్కడం లేదని వాపోతున్నారు. ఎట్టకేలకు ఈ ఏడాది రహదారి పనులు చేపట్టినప్పటికీ పనులు నత్తనడకన సాగుతున్నాయని ప్రజల నుంచి విమర్శలు వినపడుతున్నాయి.

ఇదిలా వుండగా సిద్దారెడ్డిపల్లెవద్ద వున్న లోలెవెల్ బ్రిడ్జి ప్రమాదకరంగా కూలేందుకు సిద్ధంగా వుంది. పొంచివున్న ప్రమాదంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే తుమ్మకొండ లెవెల్ బ్రిడ్జి పూర్తిగా దెబ్బతినడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు గుర్తించి ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

కోనకు కూటమి నేతల పాదయాత్ర



నిత్యపూజ కోనకు పాదయాత్రగా వెళుతున్న కూటమి నేతలు

సిద్దవటం, జూన్ 10: మండల కేంద్రమైన సిద్దవటం నుంచి నిత్యపూజ స్వామి కోనకు సోమవారం ఎన్‌డీఏ కూటమి నేతలు కాలినడకన తరలివెళ్లారు. లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వర, శివపార్వతుల దర్శనానికి జనసేన పార్టీ నేత అతికారి కృష్ణ నేతృత్వంలో వెళ్లారు. మైనార్టీ అధ్యక్షుడు షేక్ మహబూబ్‌బాషా వీరికి అల్పాహారం, విందు ఏర్పాటు చేశారు. రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు పుత్తా రామచందయ్య పాదయాత్ర చేసే వారిని ఘనంగా సత్కరించి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు కార్యదర్శి నాగమునిరెడ్డి, రాజంపేట నియోజకవర్గ యువ నాయకుడు రాజానాయుడు, రాష్ట్ర వాణిజ్య కార్యనిర్వహణ కార్యదర్శి గంజి సుబ్బరాయుడు, పార్లమెంటు వాణిజ్య విభాగపు అధికార ప్రతినిధి ఎన్ఆర్ఐ చంద్ర, టీడీపీ నేత చెంచయ్యనాయుడు, అసెంబ్లీ అధికార ప్రతినిధి రామ్మోహన్‌నాయుడు, మాజీ సర్పంచు రాజశేఖర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, మండల బీజేపీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీఏ కూటమి విజయం సాధించడం అభినందనీయం

● రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుబ్బమ్మ

సిద్దవటం, జూన్ 10: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించడం సంతోషదాయకమని, రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని అఖిల భారత ఫార్వర్డ్ బ్యాక్‌వర్డ్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కోటపాటి సుబ్బమ్మ అన్నారు. మండలంలోని ఉప్పరపల్లెలో సోమవారం ఆమె స్వగృహంలో విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమికి ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు పలికి విజయం సాధించి పెట్టారన్నారు. నూతన ప్రభుత్వాన్ని తాము స్వాగతిస్తున్నామని, రాజంపేట నియోజకవర్గం అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. గత ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా రాజంపేటకు తీరని అన్యాయం చేశారన్నారు. అన్నమయ్య డ్యాం బాధితులకు న్యాయం చేయలేదని, కనీసం వారికి పక్కాగృహాలు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు.

వైభవంగా గజ్జెల పూజ

పుల్లంపేట, జూన్ 10: మండల పరిధిలోని తిప్పాయపల్లె గ్రామంలో గజ్జెలపూజ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామదేవత శ్రీ కొత్తపులి ఎల్లమ్మ ఆలయం వద్ద కోలాటం, చెక్కభజనపై చిన్నారులు, యువకులు గజ్జెలపూజ మహోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు రాధాకృష్ణయ్య ఆధ్వర్యంలో చల్లా తిరుమలయ్య, హరినాధరెడ్డిలు శిక్షణలు ఇచ్చారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి

● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర, జిల్లా నేతలు



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ ఎస్టీ సెల్ నేతలు

రాయచోటిటౌన్, జూన్ 10: కూటమి అభ్యర్థిగా, రాయచోటి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో రాయచోటి నియోజకవర్గంలో గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బుక్కే మనోహర్‌నాయక్, రాజంపేట పార్లమెంట్ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అమావాస్య రెడ్డెయ్యలు అన్నారు. సోమవారం వారు రాయచోటి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులు కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే రాంప్రసాద్ రెడ్డికి అండగా నిలిచిన గిరిజనులకు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడమే కాకుండా భవిష్యత్తులో గిరిజనుల అభివృద్ధికి తమవంతు పాటు పడతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి మిట్టే నాయక్, రాజంపేట పార్లమెంట్ ఎస్టీ సెల్ నాయకులు కిశోర్‌నాయక్, జయరాంనాయక్, నిత్యపూజయ్య, సునీల్, బబద్దునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎండీసీ సమస్యలపై చర్చలు వాయిదా



అసిస్టెంటు లేబర్ కమిషనర్ వద్ద కార్మిక పోరాట కమిటీ నాయకులు

ఓబులవారిపల్లె, జూన్ 10: ఏపీఎండీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అసిస్టెంటు లేబర్ కమిషనర్ (సెంట్రల్) హైదరాబాదు వారు, ఏపీఎండీసీ యాజమాన్యం హాజరు కాలేదని చర్చలను జూలై 11వ తేదీకి వాయిదా వేసినట్లు లేబర్ కమిషనర్ పోరాట యూనియన్ జనరల్ సెక్రటరీ రేకులకుంట వెంకటేష్ తెలిపారు. సోమవారం ఏపీఎండీసీ సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు సమానపనికి సమాన వేతనం కేటాయింపులో జరిగిన లోటుపాట్ల గురించి, మృతిచెందిన అవుట్ సోర్సింగ్, ట్రైనీ కార్మికుల కుటుంబాలకు రావాల్సిన రూ.10 లక్షల డెత్ ఇన్సూరెన్స్ గురించి మాట్లాడారు. అలాగే పెండింగ్‌లో వున్న సుమారు రూ.28 లక్షల మెడికల్ బిల్లులు, రిటైర్మెంటు అయిన అవుట్ సోర్సింగ్ కార్మికులకు గ్రాట్యూటీ ఇవ్వాలని అసిస్టెంటు లేబర్ కమిషనర్ సెంట్రల్ హైదరాబాదు వారిని డిమాండు చేశారు. అయితే నూతన ప్రభుత్వం ఏర్పడుతున్న సందర్భంగా ఏపీఎండీసీ హెడ్ ఆఫీస్‌ను తాత్కాలికంగా మూసివేసిన కారణంగా ఏపీఎండీసీ యాజమాన్యం చర్చలకు హాజరుకాలేక పోతున్నామని తెలిపారు. మరోసారి సమావేశానికి తప్పకుండా హాజరవుతామని తెలిపారు. ఇందుకు అసిస్టెంటు లేబర్ కమిషనర్ జూలై 11వ తేదీకి చర్చలను వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇది నీటి కుంట కాదు... రోడ్డు



పుల్లంపేట పోలీసుస్టేషన్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పుల్లంపేట, జూన్ 10: స్థానిక చిట్వేలి రోడ్డులో, పోలీస్‌స్టేషన్ ఎదురుగా, ప్రధాన రహదారి కుంటను తలపిస్తోంది. వర్షం వస్తే మోకాటి లోతు నీళ్లు నిలుస్తున్నాయి. వర్షం తగ్గినా వారం రోజుల పాటు నీళ్లు అలాగే వుంటున్నాయి. పాదచారులు, వాహనదారులు ఈ మార్గంలో వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. చిట్వేలి రోడ్డుగుండా సుమారు 40 గ్రామాల ప్రజలు రాకపోకల సాగించడమే కాకుండా పోలీసుస్టేషన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, రెండు ఉన్నత పాఠశాలల విద్యార్థులు, ఎస్‌బీఐ బ్యాంకు, హాస్టల్ విద్యార్థులు ఈ రోడ్డుగుండా వెళ్లాల్సి వుంది. రోడ్డు విస్తరణలో భాగంగా కొంత వరకు వేసి వదిలేశారు. దీంతో వర్షపు నీరు నిలిచి రోడ్డు కుంటను తలపిస్తోంది. అధికారులు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన సుగవాసి



లోకేశ్‌ను సన్మానిస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, జూన్ 10: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్‌ను సోమవారం విజయవాడలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు సుగవాసి ప్రసాద్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి విజయంలో కీలకపాత్ర పోషించిన లోకేశ్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లాలో టీడీపీ విజయంపై చర్చించారు. అలాగే భవిష్యత్తులో ప్రజా సంక్షేమం కోసం చేపట్టాల్సిన చర్యల గురించి మాట్లాడారు.

చిట్వేలి: సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయం సాధించి చంద్రబాబు మూడోసారి ఏపీ సీఎంగా బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా సోమవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో టీడీపీ మండల అధ్యక్షుడు, రాష్ట్ర తెలుగు ఉపాధ్యక్షుడు కేకేచౌదరి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్‌ను, చంద్రబాబును, ఆయన సతీమణి భువనేశ్వరిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేకే మాట్లాడుతూ చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం మరలా అభివృద్ధి చెందుతుందన్నారు.

రాజంపేటటౌన్: సోమవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తే మంచి భవిష్యత్తు వుంటుందని, విద్యార్థులకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా టీఎన్ఎస్ఎఫ్ నాయకులు వుండాలని లోకేశ్ చెప్పారని తెలిపారు.

సహకార సంఘం అధ్యక్షుల పదవికి రాజీనామా

రామాపురం, జూన్ 10: మండలంలోని సరస్వతిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు అయోధ్యాపురం పెద్దిరెడ్డి, రాచపల్లి సహకార సంఘం అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డిలు సోమవారం తమ పదవులకు రాజీనామా చేసినట్లు సహకార సంఘం కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రావడంతో వైఎస్ మద్దతుదారులైన వారు రాజీనామా చేసినట్లు ఆయన అన్నారు.

కేంద్ర సహాయమంత్రికి శుభాకాంక్షలు



శ్రీనివాస వర్మకు శుభాకాంక్షలు తెలుపుతున్న రమేశ్ నాయుడు

రాజంపేట, జూన్ 10: కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణం చేసిన భూపతిరాజు శ్రీనివాసవర్మకు సోమవారం పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపినట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ పోతుగుంట రమేశ్‌నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా రమేశ్ నాయుడు మాట్లాడుతూ ఇది ఏపీలో ప్రతి కార్యకర్తకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. ఆయనకు మంత్రి పదవి ఇవ్వడం ఆంధ్రప్రదేశ్‌లో వున్న బీజేపీ కార్యకర్తలందరికీ దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు.

మంచాలమ్మకు ఘనంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సుండుపల్లె, జూన్ 10: మండల పరిధిలోని ముడుంపాడు పంచాయతీ పించా కుడి కాలువ గట్టుపై వెలిసి ఉన్న మంచాలమ్మ తిరుణాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం ఘనంగా హోమ పూజలు నిర్వహించినట్లు ఆలయ పూజారి సుబ్బరాయుడు తెలిపారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి వేదపండితులచే హోమం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించి సాయంత్రం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

అలరించిన రేలారే రేలా

పెనగలూరు, జూన్ 10: మండల కేంద్రమైన పెనగలూరులో జరిగిన రేణుకాయల్లమ్మ తల్లి జాతర సందర్భంగా ఆదివారం రాత్రి దేవాలయ ప్రాంగణంలో ప్రొద్దుటూరుకు చెందిన బద్రి గ్రూపు సభ్యులచే 10 మంది జానపద కళాకారులు రేలారే రేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు రకాల జానపద గేయాలు, పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. అయిదు మంది పురుషులు, మరో అయిదు మంది మహిళలు పల్లెటూరి సంప్రదాయ వస్త్రధారణతో జానపద ఆటలాడారు. పురుషులు పంచె, పైమా, మహిళలు పట్టు చీరలు, నార చీరలు ధరించి కాళ్ళకు గజ్జెలు, మువ్వలు కట్టుకుని నాట్యమాడారు. జానపద పాటలు, గేయాలు, నృత్య ప్రదర్శన తిలకించిన ప్రేక్షకులు పాత రోజుల్లో తమ పూర్వీకులు కూడా ఇలాగే పొలంగట్లు, పంటల పొలాల్లో పాడుకున్న జానపదగేయాలు, రాగాల గురించి చర్చించుకోవడం గమనార్హం. ఏదేమైనా ఓల్డ్‌ఈజ్ గోల్డ్ అనుకుంటూ పాత రోజులే బంగారు భవితను పంచిన రోజులని చర్చించుకున్నారు.

నారాలోకేశ్‌ను కలిసిన రామచంద్రయ్య

రాజంపేట, జూన్ 10: ఉండవల్లిలోని చంద్రబాబునాయుడు నివాసంలో సోమవారం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను టీడీపీ మాజీ మంత్రి, పార్లమెంటు సభ్యులు సి.రామచంద్రయ్య, ఆయన తనయుడు, యువనాయకులు సి.విష్ణుస్వరూప్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లోకేష్‌కు వారు శుభాకాంక్షలు తెలిపారు.



లోకేశ్‌తో రామచంద్రయ్య, విష్ణుస్వరూప్‌లు

జేఈఈ అడ్వాన్సులో మెరిసిన ఆణిముత్యం విష్ణువర్ధన్



బీ.విష్ణువర్ధన్

రామాపురం, జూన్ 10: ఆదివారం విడుదల చేసిన 2024 జేఈఈ అడ్వాన్సు ఫలితాల్లో బొందల విష్ణువర్ధన్ ఆల్ ఇండియా ఓబీసీ కేటగిరిలో 207వ ర్యాంకు సాధించి తన సత్తా చాటుకున్నారు. అన్నమయ్య జిల్లా రామాపురం మండలం నల్లగుట్టపల్లె గ్రామం కొత్తపల్లి బొందల విశ్వనాధ్ (టీచర్), సతీమణి బొందల నాగరత్నల చిన్న కుమారుడు విష్ణువర్ధన్ చిన్ననాటి నుంచి తన ప్రతిభను కనపరుస్తూ జేఈఈ సాధించారు. విష్ణువర్ధన్ 1వ తరగతి నుంచి 6వ తరగతి వరకు రాయచోటి రాజు స్కూల్‌లో 7వ తరగతి నుంచి పదవ తరగతి వరకు విజయవాడ కాలేజీలో విద్యనభ్యసించి జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఆలిండియా బీసీ కేటగిరిలో 207 ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. తల్లిదండ్రులను తన చదువు అభ్యసించిన ఉపాధ్యాయులను ఆనందానికి గురిచేశారు.

చంద్రబాబు ప్రమాణస్వీకార మహోత్సవం

ప్రత్యక్ష ప్రసార వీక్షణకు ఏర్పాట్లు

నోడల్ ఆఫీసర్ల నియామకం - కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 10: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఈనెల 12న ప్రమాణస్వీకారం చేయనున్న తరుణంలో జిల్లా అంతటా వివిధ ప్రాంతాల్లో ప్రత్యక్ష ప్రసార వీక్షణకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టర్ ఛాంబర్ నుంచి సీఎం ప్రమాణస్వీకార మహోత్సవానికి చేపట్టాల్సిన పలు అంశాలపై ఆర్డీవోలు, డివిజన్, నియోజకవర్గ మున్సిపల్, మండల తహసీల్దార్, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ తదితర అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సూచనలు జారీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాణస్వీకార మహోత్సవాన్ని ప్రజలందరూ వీక్షించేలా నాగయ్య కళాక్షేత్రంలో అధికారపూర్వకంగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. నియోజకవర్గ కేంద్రాల్లోనూ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఔత్సాహిక యువత, ప్రజలు విజయవాడకు వెళ్లేందుకు వీలుగా నియోజకవర్గానికి నాలుగు బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి బస్సుకు ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం రాత్రి నుంచి బుధవారం వరకు ప్రభుత్వ కార్యాలయాలన్నీ విద్యుత్ కాంతులతో వెలిగేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, డీఆర్డీఏ పీడీ తులసి, జడ్పీ సీఈవో గ్లోరియా, డీపీవో లక్ష్మి, నగరపాలక కమిషనర్ అరుణ పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో అసెంబ్లీ మాజీ స్పీకర్


తమ్మినేనికి జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి

ఐరాల(కాణిపాకం), జూన్ 10: ఏపీ అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో విద్యాసాగర్ రెడ్డి ఆయనకు స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.

నేడు, రేపు ఎంజేఆర్ కళాశాలలో మెగా జాబ్ మేళా


ఎంజేఆర్ కళాశాల చైర్మన్ ఎంపీ అవినాశ్ రెడ్డి

పీలేరు, జూన్ 10: అన్నమయ్య జిల్లా పీలేరులోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నేడు, రేపు మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ ఎంపీ అవినాశ్ రెడ్డి తెలిపారు. మేజిక్ బస్ ఫౌండేషన్ ఇండియా వారి సౌజన్యంతో రెండు రోజుల పాటు జరగనున్న జాబ్ మేళాలో 50కి పైగా కంపెనీలు పాల్గొంటాయని, సుమారు వేయి ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు పూర్తి చేసిన వారందరూ జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హులని ఆయన వివరించారు. జాబ్ మేళాలో టెక్ మహీంద్రా, ట్రెండ్స్ ఇన్ఫర్మేషన్స్, జీఎస్ఎస్ గ్లోబల్, 24/7 ఏఐ, రోబోట్-ఈడీ, సాథర్లాండ్, టీం లీజ్, ఈటీఎస్ గ్లోబ్, క్వెస్ కార్ప్, అపోలో, ఫ్యూషన్ సి ఎక్స్ యంగ్ మైండ్స్, గ్రీన్ బ్లిస్స్, కాలిబర్ హెచ్‌ఆర్, ఎయిర్‌టెల్ తదితర కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే తమ కళాశాలలో 30కిపైగా ప్రముఖ బహుళజాతి కంపెనీలైన టీసీఎస్, ఆక్సెంచర్, డెల్టా ఎక్స్, ఆలోహ టెక్నాలజీస్, సూర్య టెక్ ప్రాంగణ ఎంపికలు చేసినట్లు తెలిపారు. తమ కళాశాలలో చదివిన ప్రతి విద్యార్థికీ ఉద్యోగిగా అవకాశం కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. మేజిక్ బస్ ఫౌండేషన్ ఇండియా ప్రతినిధి వెంకట్ మాట్లాడుతూ రెండు రోజుల జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఏడాదికి రూ.5.50 లక్షల వేతనం ఉంటుందని తెలిపారు. పీలేరు పరిసర ప్రాంత నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పోలీసు శునకం ఉద్యోగ విరమణ


పదవీ విరమణ పొందిన బిందు అనే శునకాన్ని సత్కరించిన పోలీసులు

చిత్తూరు, జూన్ 10: డాగ్‌స్క్వాడ్ విభాగంలో పనిచేసే బింధు అనే పోలీసు శునకం ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎస్పీ మణికంఠ దానికి శాలువాకప్పి, సత్కరించారు. పలు కేసుల దర్యాప్తులో బిందు సేవలను ఆయన కొనియాడారు. ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీలు మహబూబ్ బాషా, ఆర్ఐ సుధాకర్ హాజరయ్యారు.

బిందు శునకం వివరాలు...

బిందు 2013 జనవరి 22న జన్మించింది. ల్యాబ్రడార్ జాతికి చెందింది. వీఐపీ, వీవీఐపీ కార్యక్రమాల్లో మెరుగ్గా సేవలందించింది. కాణిపాకం, తిరుమల బ్రహ్మోత్సవాల సమయాల్లోనూ దీని సేవలను వినియోగించారు. పోలీసు డ్యూటీమీట్‌లో ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించింది.

టీటీడీ పీఆర్వో బాధ్యతల స్వీకరణ


నీలిమ

తిరుమల, జూన్10(ఆంధ్రజ్యోతి): టీటీడీ పీఆర్వో(పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్)గా నీలిమ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పీఆర్వోగా ఉన్న రవి చీఫ్ పీఆర్వోగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఏపీఆర్వోగా ఉన్న నీలిమ పీఆర్వోగా(ఫుల్ అడిషనల్ ఛార్జ్) నియమితులయ్యారు. ఈమేరకు ఆమె తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో సోమవారం సాయంత్రం బాధ్యతలు తీసుకున్నారు.

13నుంచి మహతిలో నాబార్డు మేళా

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 10: తిరుపతి మహతి కళాక్షేత్రంలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు నాబార్డు ఆధ్వర్యంలో ఎఫ్‌పీవో మేళా-తరంగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీడీ సునీల్ తెలిపారు. ఈమేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్మాల్ ఫార్మర్స్ అగ్రి-బిజినెస్ కన్సార్టియం, ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ భాగస్వామ్యంతో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేళాలో గో ఆధారిత వ్యవసాయంతో పండించిన ఉత్పత్తులు, రైతులు సేంద్రియ పద్ధతిలో పండించిన ఉత్పత్తులు, చేనేతల కలంకారీ చీరలు, చెక్కతో చేసిన విగ్రహాలు, కుండలు మొదలైన ఉత్పత్తులను 50స్టాల్స్ ద్వారా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులను, కళాకారులను ప్రోత్సహించడం, వారిఆదాయం పెంచడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ప్రజలు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతిరోజు సాయంత్రం 5గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు.

14న గోవిందరాజస్వామి ఆలయంలో పుష్పయాగం

తిరుపతి (కల్చరల్) జూన్ 10: తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో జూన్ 14వ తేదీ శుక్రవారం పుష్పయాగం నిర్వహించనున్నట్లు టీటీడీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇందుకోసం 13వ తేదీ సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆలయంలో అంకురార్పణ నిర్వహిస్తారు. 14వ తేదీ ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి ఉత్సవ మూర్తులకు ఆలయంలో స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 4 గంటల వరకు పుష్పయాగం వైభవంగా జరుగుతుంది.

20నుంచి హనుమ నాటకోత్సవాలు

తిరుపతి అర్బన్, జూన్ 10: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో ఈనెల 20నుంచి హనుమ నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపకులు బి.ఎస్.రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అభినయ ఆర్ట్స్ 24వ వార్షికోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం తలపెట్టామన్నారు. 20నుంచి 28వ తేదీ వరకు జాతీయస్థాయి పద్యనాటకాలు, సాంఘిక నాటికలు, కూచిపూడి, భరతనాట్యం, జానపద, సోలో నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ పోటీలలో పాల్గొనడానికి తెలుగు రాష్ట్రాల నుంచి 32 పద్య, 57 సాంఘిక నాటికల దరఖాస్తులు అందాయన్నారు. పరిశీలన అనంతరం 9 పద్య, 12 సాంఘిక నాటికల దరఖాస్తులను ఎంపిక చేశామన్నారు. ప్రతిభకనబరచిన ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు, రోలింగ్ షీల్డ్స్, హనుమ అవార్డ్స్, జ్ఞాపికలు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి, విశ్వనాథరెడ్డి, విజయ్‌కుమార్, శోభ, కోటేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి కోటకు బీటలు

- చెరి మూడు మండలాల్లో టీడీపీ, వైసీపీలకు ఆధిక్యత
- పోరాడి ఓడిన చల్లా బాబు


పెద్దిరెడ్డి


చల్లా బాబు

పుంగనూరు, జూన్ 10: పుంగనూరు రాజకీయాలను 15 ఏళ్లుగా శాసిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఏకచత్రాధిపత్యానికి కళ్లెం పడింది. గతంలో కనుచూపు మేరలో కనిపించని టీడీపీ ఈసారి గెలుపు వాకిలి వరకు వెళ్లగలిగింది. వైసీపీ ప్రభుత్వంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారు. ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టిన ప్రతిపక్ష నాయకులను కేసులతో పాటు ఆర్థికపరమైన ఇబ్బందులకు గురిచేస్తూ భయపెట్టేలా చేశారు. అన్నిశాఖల్లో అనుకూలమైన అధికారులను నియమించుకుని పోలీసు రాజ్యం సాగించారు. వారి తీరుతో విసిగిపోయిన పుంగనూరు ప్రజలు అవకాశం కోసం వేచి ఉండి ఎన్నికల్లో దాదాపు ఓడించినంత పని చేశారు. తక్కువ మెజారిటీతో పెద్దిరెడ్డి బయటపడాల్సి వచ్చింది.


43వేల నుంచి 6వేలకు పడిపోయిన మెజారిటీ

పుంగనూరు నియోజకవర్గంలో 1,17,072 పురుష, 1,21,791 మహిళ, ట్రాన్స్‌జెండర్లు ఐదుగురితో కలిపి మొత్తం 2,38,868 ఓట్లున్నాయి. ఈ ఎన్నికల్లో 2,06,916 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2009 నియోజకవర్గాల పునర్విభజనలో పీలేరు నుంచి పుంగనూరుకు వచ్చి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన పెద్దిరెడ్డి టీడీపీ అభ్యర్థి ఎం.వెంకటరమణరాజుపై 40,299 ఆధిక్యతతో గెలిచారు. 2014లో వైసీపీ తరఫున పోటీ చేసి టీడీపీ అభ్యర్థి వెంకటరమణరాజుపై 31,731 ఓట్ల ఆధిక్యతతో రెండోసారి విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఎన్.అనీషారెడ్డిపై 43,343 మెజార్టీతో విజయం సాధించారు. ప్రస్తుతం టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిపై 6,095 ఓట్లతో గట్టెక్కారు.

పోరాడి ఓడిన టీడీపీ అభ్యర్థి చల్లా బాబు

పుంగనూరు నియోజకవర్గంలో వైసీపీ పాలనలో ప్రతిపక్షాలపై రాజకీయపరంగా దాదాపు వెయ్యిమందిపై పోలీసులు కేసులు పెట్టారు. పలువురిపై రౌడీషీట్లు తెరిచారు. దీనిపై టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి అలుపెరగని పోరాటం చేశారు. పార్టీ శ్రేణులకు అండగా నిలవడమేగాక జైలుకు సైతం వెళ్లి వచ్చారు. తద్వారా ఓటర్లలో ఆయనపై నమ్మకం పెరిగింది. ఎన్నికల ఫలితాల్లో తొలి రెండు రౌండ్ల మెజారిటీ సాధించడంతో టీడీపీ శ్రేణుల్లో గెలుపుపై ఆశలు చిగురించాయి. తర్వాత రౌండ్లలో వైసీపీకి ఆధిక్యత వచ్చింది. 7 రౌండ్లలో టీడీపీ, 12రౌండ్లలో వైసీపీ ఆధిక్యత సాధించాయి. పుంగనూరు టౌన్‌లో 3,236 ఓట్లు, రూరల్‌లో 715 ఓట్లు, పెద్దిరెడ్డి సొంత మండలం సదుంలో 4,218 ఓట్లు, పులిచెర్ల మండలంలో 448 ఓట్లు వైసీపీ అదనంగా సాధించగలిగింది. చౌడేపల్లె మండలంలో 983, సోమల మండలంలో 460, చల్లా బాబు సొంత మండలం రొంపిచెర్లలో 555 ఓట్లు టీడీపీ ఆధిక్యత సాధించింది. 2,763 పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో టీడీపీకి 1543, వైసీపీకి 1019, నోటాకు 20 ఓట్లు పడ్డాయి. బీసీవై పార్టీ అభ్యర్థి బోడే రామచంద్రయాదవ్‌కు 4,559 ఓట్లు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మురళీమోహన్ యాదవ్‌కు 3,546 ఓట్లు దక్కాయి. చివరికి చల్లా బాబుకు 94,698 ఓట్లు, పెద్దిరెడ్డికి 1,00,793 ఓట్లు రాగా వైసీపీ 6,095 ఓట్లతో విజయం సాధించింది.

గుట్టలు మాయమవుతున్నాయ్!


టీకేఎం పేట సమీపంలో గుట్ట ఆక్రమణ

కార్వేటినగరం, జూన్ 10: డిప్యూటీ సీఎం నారాయణస్వామి సొంత మండలమైన కార్వేటినగరంలో రుషికొండను తలపించేలా గుట్టల ఆక్రమణల పర్వం జోరుగా సాగుతోంది. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న సమయంలోనూ ఈ తంతు ఆగలేదు. రెవెన్యూ అధికారుల అండతో వైసీపీ నేతలు యథేచ్ఛగా తమ పని కానిచ్చేశారు. కలికిరిండ్లు గ్రామం వద్ద బల్లిగుట్ట ను ఒక నాయకుడు ఆక్రమించినా రెవెన్యూ అధికారులు కనీసం స్పందించలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అలాగే టీకేఎం పేట గ్రామ సమీపంలోని బిల్లుదొన బోటు సమీపంలో ఉన్న అడవి పై భాగాన్ని జేసీబీ యంత్రాలతో నామరూపాలు లేకుండా చేశారు. మామూళ్లకు అలవాటుపడిన రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు సహకరించారన్న ఆరోపణలున్నాయి. పాసు పుస్తకాన్ని మార్చేందుకు లంచం తీసుకుంటూ దొరికిన అధికారిని కటకటాల పాలు చేసినా మార్పు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.


బుల్లిగుట్ట ప్రాంతంలో గుట్ట ఆక్రమణ

పాస్‌పోర్టు కార్యాలయంలో మొరాయించిన కంప్యూటర్లు

మూడు గంటల పాటు దరఖాస్తుదారుల పడిగాపులు


క్యూలైన్‌లో వేచి ఉన్న దరఖాస్తుదారులు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 10: తిరుపతి పాసుపోర్టు సేవా కేంద్రంలో సోమవారం మూడు గంటల పాటు కంప్యూటర్లు మొరాయించాయి. దీంతో దూర ప్రాంతాల నుంచి పాసుపోర్టు దరఖాస్తు కోసం వచ్చిన అభ్యర్థులు నానా ఇబ్బందులు పడ్డారు. స్లాటు బుక్ చేసుకుని దరఖాస్తు చేసుకుని చంటి బిడ్డలతో వచ్చిన కొందరు నడి రోడ్డుపై గంటల తరబడి నిలబడ లేక నానా తంటాలు పడ్డారు. వీరికి అవసరమైన సమాచారం ఇవ్వడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించారనే విమర్శలు వినిపించాయి. సెంట్రల్ సర్వర్ పనిచేయకపోవడంతో తిరుపతి పాసు పోర్టు కార్యాలయంలోని కంప్యూటర్లు పూర్తిగా పనిచేయలేదు. దరఖాస్తు దారులు సహనం కోల్పోయి ఆందోళనకు దిగే పరిస్థితి ఏర్పడింది. దీంతో స్పందించిన అధికారులు ఆగమేఘాలపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపి మళ్లీ సర్వర్ పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. 11.30 గంటల తర్వాత యథావిధిగా కంప్యూటర్లు పనిచేయడంతో దరఖాస్తు దారులు ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం వచ్చిన వారందరికీ అవసరమైన సేవలు అందించి పంపారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, జూన్ 10: వచ్చే ఏడాది జనవరి 26న భారత ప్రభుత్వం ప్రకటించే పద్మ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈవో మురళీకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్, ఇంజనీరింగ్, ప్రజా వ్యవహారాలు, పౌరసేవలు, వృత్తి, పరిశ్రమలు తదితర రంగాలలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన వ్యక్తులు అర్హులని పేర్కొన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పద్మాఅవార్డ్స్ జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని, వాటిని ఈనెల 22లోపు అలిపిరి వద్ద వున్న సెట్విన్ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం 0877-2286921, 94405 73537 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య


పరశురాం (ఫైల్ ఫొటో)

వడమాలపేట, జూన్ 10: అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వడమాలపేట మండలంలోని సోమవారం జరిగింది. మ్డంలోని తిరుమణ్యం గ్రామానికి చెందిన పరశురాం(43) భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవాడు. అందులో నష్టాలు రావడంతో గొర్రెల పెంపకం చేపట్టాడు. ఈ క్రమంలో సుమారు 15 లక్షల మేరకు అప్పులు చేశాడు. ఇటీవల గొర్రెలు వ్యాధి బారిన మృతి చెందాయి. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. సోమవారం పురుగుల మందు తాగాడు. స్థానికులు గుర్తించి తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు.

నేడు బంగారమ్మ జాతర

శ్రీకాళహస్తి, జూన్ 10: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలోని పిచ్చాటూరు రోడ్డులో వెలసిన బంగారమ్మ ఆలయంలో మంగళవారం నుంచి జాతర జరగనుంది. ఉదయం 6గంటలకు అభిషేకం, 7గంటలకు గరిగె పూజ, అంబళ్లు, 10గంటలకు మైలు ముగ్గు, మధ్యాహ్నం 2గంటలకు పోతురాజు ముగ్గు, సాయంత్రం 4గంటలకు భక్తులు పొంగళ్లు పెడుతారు. 12వ తేదీ బుధవారం ఉదయం 6గంటలకు అభిషేకం, అలంకారం, అమ్మవారి ముగ్గు, సాయంత్రం 4గంలకు కుంభం, 6గంటలకు బంగారమ్మ అమ్మవారి ఊరేగింపు, నిమజ్జనం జరుగుతుంది. సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో ఎస్వీ నాగేశ్వరరావు జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. క్యూలైన్లు, భక్తులకు వసతులను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి పలురకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయ స్వామివారికి మొదట పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంలో వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో స్వామివారిని శోభాయమానంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అధికారులు పాల్గొన్నారు.

మాంబట్టు సెజ్ డంపింగ్‌యార్డులో

అగ్నిప్రమాదం


భారీగా ఎగిసిపడుతున్న అగ్నికీలలు

తడ, జూన్ 10: మండల పరిధిలోని మాంబట్టు సెజ్‌లో ఓ డంపింగ్ యార్డులో అగ్నిప్రమాదం జరిగింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంట లను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మాంబట్టు సెజ్‌లోని తైచికాస్ట్ పరిశ్రమకు సమీపంలో ప్రైవేట్ వ్యక్తులకు చెందిన డంపింగ్‌యార్డు ఉంది. అక్కడ అన్ని రకాలైన పనికిరాని వస్తువులన్నీ డంప్ చేసి ఉన్నారు. సోమవారం సాయంత్రం ఆ డంపింగ్‌యార్డులో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో పక్కనే ఉన్న తైచికాస్ట్ పరిశ్రమ ఆ మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తూనే స్థానిక పోలీసులకు, అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించింది. హుటాహుటిన అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు మంటలను అదుపుచేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అగ్నిమాపక దళానికి చెందిన రెండు ఫైరింజన్లు, అపాచీ పరిశ్రమకు చెందిన మరో ఫైర్ ఇంజన్ మంటలను అదుపు చేయడానికి ప్రయత్నిస్తున్నా పెద్ద ఎత్తున ఎగిసి పడుతున్నాయి. దీనికితోడు ఈదురుగాలులు సైతం తోడయ్యాయి. రాత్రి 7.30 గంటలు గడుస్తున్నా మంటలు అదుపులోకి రాకపోవడంతో పక్కనే ఉన్న తైచీకాస్ట్ పరిశ్రమకు ప్రమాదం పొంచి ఉండటంతో ఆందోళన నెలకొంది.

విచారణ జరపాలా..? వద్దా?

కలెక్టరును కోరిన ఆడిట్ అధికారులు

జడ్పీ మాజీ సీఈవో అవినీతిపై నిలిచిన విచారణ



చిత్తూరు రూరల్, జూన్ 10: జడ్పీ మాజీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి అవినీతిపై జిల్లా ఆడిట్ అధికారులు జరుపుతున్న విచారణ తాత్కాలికంగా నిలిచింది. ఈ విచారణ ప్రారంభించేందుకు జడ్పీ విశ్రాంత అధికారి, ఉద్యోగులు ఎంతో కష్టపడ్డారు. ప్రభాకర్‌రెడ్డి రాజకీయ పలుకుబడి కారణంగా అడుగడుగునా అడ్డుపడ్డారు. చివరకు లోకయుక్తకు ఫిర్యాదు చేయడంతో విచారణ మొదలైంది. ఆడిట్ అధికారులు ఆధారాలు సేకరించి విచారణ ప్రారంభమవుతుందనే లోపే మళ్లీ నిలిచిపోయింది. గత ఆడిట్‌లో అధికారులు ప్రభాకర్‌రెడ్డి అవినీతి చేయలేదని యుటిలైజేషన్ సర్టిఫికెట్ (క్లీన్ చిట్) ఇవ్వడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ క్రమంలో విచారణ సక్రమంగా జరుగుతుందో లేదోనని థర్డ్ పార్టీకి ఇవ్వాలని జడ్పీ విశ్రాంత అధికారి, ఉద్యోగులు పీఆర్ కమిషనర్‌ను కోరినట్లు సమాచారం. దీంతో విచారణ చేయాలా..! వద్దా? అని ఆడిట్ అధికారులు కలెక్టర్‌కు లేఖ రాశారు. దీనిపై స్పష్టత రాకపోవడంతో విచారణ తిరిగి వాయిదా పడింది.

సస్పెండ్ చేయిస్తాం..

జడ్పీలో అధికారులను, ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసి నలుగురి మరణానికి కారణమైన ప్రభాకర్‌రెడ్డిని వదిలిపెట్టేది లేదని అటు ఉద్యోగులు...ఇటు టీడీపీ నాయకులు శపథం చేస్తున్నారు. ఈనెల 30వ తేదీ ఆయన ఉద్యోగ విరమణలోపు సస్పెండ్ చేయిస్తామని అంటున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.34 కోట్లు

తిరుమల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.34 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఆదాయ వివరాలను టీటీడీ సోమవారం ఉదయం ప్రకటించింది.

అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యలు


మాట్లాడుతున్న మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

ములకలచెరువు, జూన్ 10: ఎన్నికల కౌంటింగ్ అనంతరం అల్లర్లు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువు సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఆయన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో గొడవలు జరుగకుండా నివారించగలిగామన్నారు. కొన్ని చోట్ల చెదురుముదురు ఘటనలు జరిగినా పికెటింగ్‌లు ఏర్పాటు చేసి పెద్దవి కాకుండా అణచివేశామన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ తనిఖీల్లో సీఐ మధు, ఎస్ఐ తిప్పేస్వామి పాల్గొన్నారు.

కర్ణాటక బీర్లు స్వాధీనం.. విక్రేత అరెస్టు

మదనపల్లె టౌన్, జూన్ 10: కర్ణాటక బీర్లు విక్రయిస్తున్న మహిళను ఎస్ఈబీ పోలీసులు అరెస్టు చేసి 9 కర్ణాటక బీరుబాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ రమేశ్‌రెడ్డి తెలిపారు. సోమవారం మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని కురబలకోట మండలం అప్పినాయనిపల్లెకు చెందిన కృష్ణప్ప భార్య బి.మల్లీశ్వరి(37) కర్ణాటక బీర్లు విక్రయిస్తుండగా అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 9 కర్ణాటక బీరుబాటిళ్లు స్వాధీనం చేసుకుని రిమాండుకు పంపామన్నారు. నాటుసారా అక్రమరవాణా, విక్రయాలు, కర్ణాటక మద్యం, గంజాయి విక్రయిస్తున్న వారిపై నిఘా పెట్టామని, చట్టాన్ని ఉల్లంఘిస్తే అరెస్టు చేస్తామని సీఐ చెప్పారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నిమ్మనపల్లి, జూన్ 10: కుటుంబ సమస్యల కారణంగా ఓ వివాహిత విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాచవేటివారిపల్లి పంచాయతి గొల్లపల్లికి చెందిన అశ్విని(23) ఇంట్లో సమస్యల కారణంగా పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా వెంటనే కుటుంబీకులు గమనించి ఆమెను మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. దీంతో అశ్విని కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జూన్ 10: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. మదనపల్లె పట్టణం, టీకేపల్లె వైఎస్సార్ కాలనీకి చెందిన మస్తాన్‌వల్లి భార్య గులాబ్‌షా(28) ఈనెల 5 వతేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని బంధువులు, మిత్రుల ఇళ్ల వద్ద వెతికినా కనపడకపోవడంతో భర్త మస్తాన్‌వల్లి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ పేర్కొన్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జూన్ 10: మహిళను వరకట్న వేధింపులకు గురి చేస్తున్న భర్త, కుటుంబీకులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ ఇనాయతుల్లా తెలిపారు. మదనపల్లె పట్టణం కృష్ణానగర్‌కు చెందిన అజంతుల్లా కుమార్తె షేక్ సుఫియా (25)ను నాలుగు నెలలు క్రితం హిందూపూర్‌కు చెందిన నజీర్ కుమారుడు ఇనాయతుల్లాకు ఇచ్చి వివాహం జరిపించారు. అయితే భర్త, అత్త, మామ, మరిదిలు అదనపు కట్నం కోసం వేదింపులు పాల్పడుతున్నట్లు షేక్ సుఫియా ఆదివారం రాత్రి ఫిర్యాదు చేయడంతో ఆ మేరకు భర్త ఇనాయతుల్లా, అత్త జహీరా, మామ నజీర్, మరిది జహీర్‌లపై సోమవారం వరకట్న వేదింపుల కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ తెలిపారు.

అంగళ్లులో ఒంటె అపహరణ



కురబలకోట, జూన్ 10: ముస్లీంల బక్రీద్ పండుగకు ఖుర్బానీ కోసం తెచ్చిన ఒంటె అపహరణకు గురైన సంఘటన మండలంలో జరిగింది. దీనికి సంబంధించి బాధితుల కథనం మేరకు కథనం మండలంలోని అంగళ్లు పంచాయతీ పోరెడ్డివారిపల్లెకు చెందిన కొంత మంది బక్రీద్ పండుగకు ఖుర్బానీ ఇవ్వడానికి 7మంది 15రోజుల క్రితం ఒంటెను కొనుగోలు చేశారు. కాగా ఇంటి ముందు కట్టేసిన ఒంటెను గుర్తుతెలియని దుండగులు అర్ధరాత్రిలో అపహరించారు. కాగా కొనుగోలుదారులు చుట్టుపక్కల వెతికినా ఆచూకి దక్కకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పలుచోట్ల సీసీ కెమెరాలను పరిశీలించగా మదనపల్లె వైపు గుర్తుతెలియని వ్యక్తి తీసుకెళ్ళినట్లు రికార్డైంది. కాగా ఒంటెకు సంబంధించి ఆచూకీ అందించిన వారికి రూ.20వేలు పారితోషకం అందిస్తామని బాధితులు పేర్కొన్నారు.

ఘనంగా పైడిమర్రి జయంతి


పైడిమర్రి సుబ్బారావుకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

వాల్మీకిపురం, జూన్ 10: ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు జయంతి వేడుకలను సోమవారం జనవిజ్ఞాన వేధిక ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. వాల్మీకిపురం మైనార్టీ బాలికల గురుకుల కళాశాలలో పైడిమర్రి వెంకట సుబ్బారావు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ ప్రతిజ్ఞ రూపకల్పన ద్వారా ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేధిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్, కళాశాల ప్రిన్సిపాల్ రమామంజుల, అధ్యాపకులు లోకనాథం, బాబాజాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్ల కట్టడికి చర్యలు

● పీకేఎం ఉడా వైస్ చైర్మన్ బాబర్


అనధికార లేఅవుట్‌లపై అధికారులతో సమీక్షిస్తున్న పీకేఎం ఉడా వైస్ చైర్మన్ బాబర్

మదనపల్లె, జూన్ 10: మదనపల్లె మున్సిపాలిటీలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అనధికార లేఅవుట్ల కట్టడికి చర్యలు తీసుకోవాలని పలమనేరు, కుప్పం, మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ (పీకేఎం ఉడా) వైస్ చైర్మన్ ఎం.బాబర్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం మదనపల్లె డీఎల్‌పీవో కార్యాలయంలో అనధికార లేవుట్ల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గడిచిన రెండు, మూడు నెలలుగా ఎలక్షన్ విధులు కారణంగా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడా చూసినా ఇబ్బడిముబ్బడిగా అనధికార లేఅవుట్లు వేశారన్నారు. అటువంటి లేఅవుట్లను క్షేత్రస్థాయిలో గుర్తించి అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వేసిన లేఅవుట్లు యజమానికి నోటీసులు ఇచ్చి ఎల్ఆర్ఎస్ ద్వారా రెగ్యులరైజ్ చేసుకునేవిధంగా చూడాలన్నారు. ముఖ్యంగా ప్లాన్ లేకుండా నిర్మిస్తున్న పెద్ద పెద్ద నిర్మాణాలు కట్టడి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎల్‌పీవో నాగరాజు, టౌన్ ప్లానింగ్ అధికారి కుమిదిని, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన బొమ్మనచెరువు శ్రీరాములు


కేంద్రమంత్రి రామ్మోహన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బొమ్మనచెరువు శ్రీరాములు

మదనపల్లె, జూన్ 10: మదనపల్లె నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత బొమ్మనచెరువు శ్రీరాములు కేంద్ర కేబినేట్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడును సోమవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. 2024 ఎన్నికల్లో బంపర్ మెజార్టీతో మూడో దఫా ఎంపీగా ఎన్నికై పిన్న వయసులోనే కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో రామ్మోహన్‌నాయుడుకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఈ సందర్భంగా కడప-బెంగళూరు రైలు మార్గాన్ని పునరుద్ధరించాలని కేంద్ర మంత్రిని కోరారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ జవహర్‌బాబు

కలకడ, జూన్ 10:సంపూర్ణ ఆరోగ్యం కోసం గర్భిణులు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి డాక్టర్ జవహర్‌బాబు తెలిపారు. ప్రధాన మంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ విధానంతో అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 45 మంది గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించి 8 మందిని మెరుగైన వైద్యం కోసం ఉన్నతస్థాయి ఆసుపత్రికి సిఫార్స్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కళామండలి అధ్యక్షుడిగా శివశంకర్‌రెడ్డి



తంబళ్లపల్లె, జూన్ 10: తంబళ్లపల్లెకు సమీపంలోని భ్రమరాంభిక సమేత మల్లికార్జున స్వామి కళామండలి అధ్యక్షుడిగా కురబలకోట మండలం అడవిపల్లెకు చెందిన శివశంకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మల్లయ్యకొండపై ఆరు మండలాల కళాకారులు ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించి శివశంకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కళాకారుల సంక్షేమానికి కృషిచేయడంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

ఫిట్టర్‌పై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె అర్బన్, జూన్10: స్థానిక మున్సిపాలిటీలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న రంగాచారినిపై చర్యలు తీసుకోవాలని బహుజన యువ సేన అధ్యక్షుడు పునీత్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు బీవైఎస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ రంగాచారి మున్సిపాలిటీలో ప్రభుత్వ జీతం తీసుకుంటున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను తన వ్యవసాయ పొలంలో ఉపయోగించుకొంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, శశికుమార్, బాలకృష్ణ, పూర్ణచంద్ర, వినయ్, జగదీష్, సాయి, ముని, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు


వెలుగువృద్ధాశ్రమంలో కేక్ కట్ చేస్తున్న సినీహీరో బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు

మదనపల్లె టౌన్, జూన్ 10:సినీహీరో, హిందూపురం హ్యాట్రిక్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక వెలుగు వృద్ధాశ్రమంలో బాలకృష్ణ జన్మదినం సందర్భంగా ఆయన అభిమాన సంఘం అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాదిమంది అభిమానాన్ని సొంతం చేసుకున్న బాలకృష్ణను ఆదర్శంగా తీసుకుని వృద్ధాశ్రమంలో వృద్దులకు పాలు, పండ్లు, దుప్పట్లు పంచిపెడుతున్నామన్నారు. అనంతరం బాలకృష్ణ సీనియర్ అభిమానులను శాలువలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు గంగారపు రామ్మూర్తినాయుడుబాలకృష్ణ అభిమాన సంఘం గౌరవాధ్యక్షుడు బొమ్మశెట్టి పురుషోత్తం, డాన్స్ రెడ్డెన్న, మాజీ కౌన్సిలర్ ఆంజినేయులు, కార్యదర్శి ప్రభాకర్, శంకర్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె మండల కేంద్రంలో హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలకు తెలుగు యువత నియోజకవర్గ కార్యనిర్వాహణ కార్యదర్శి మధుసూదన్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ..హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా విజయం సాధించి చరిత్రలో నిలిచిన గొప్ప వ్యక్తి నందమూరి బాలకృష్ణ అని కొనియాడారు. అదేవిధంగా తెలుగు యువత నియోజకవర్గ కార్యనిర్వాహణ కార్యదర్శి మధుసూదన్ జన్మదిన వేడుకలను తంబళ్లపల్లెలో టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు సాంబశివ, ప్రధాన కార్యదర్శి శివ, అశోక్‌కుమార్, ఐటీడీపీ మధు, టైల్స్‌సీన, మల్లేష్, బాలచంద్ర, విశ్వనాద, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తన కాయలు పంపిణీ


మర్రికుంటపల్లెలో జరుగుతున్న వేరుశనగ విత్తన కాయల పంపిణీ

కలికిరి, జూన్ 10: మండలంలో ఎట్టకేలకు ఖరీఫ్ పంట కోసం వేరుశనగ విత్తన కాయల పంపిణీ ప్రారంభమైంది. పది రోజులు సరఫరా అవుతున్న విత్తన కాయల్లో 60 శాతం మాత్రమే నాణ్యత ఉండటంతో అన్ని గ్రామాల నుంచి లారీల నుంచి బస్తాలు దించకుండా వెనక్కి పంపించేశారు. వాటి బదులుగా ప్రస్తుతం ఓ మోస్తరు నాణ్యత కలిగిన కాయలను సరఫరా చేయడంతో తీసుకోవడానికి రైతులు కూడా ముందుకొస్తున్నారు. మండలానికి 1340 క్వింటాళ్ళ వేరుశనగ విత్తన కాయలు కేటాయించినట్లు ఏవో మమతారెడ్డి చెప్పారు. 30 కిలోల నారాయణి రకం విత్తనాల బస్తాకు రూ.1746 వంతున ధర నిర్ణయించినట్లు తెలిపారు. మర్రికుంటపల్లె పంచాయతీలో సోమవారం జరిగిన పంపిణీలో సర్పంచు రెడ్డిరాము, చంద్రశేఖర్, చిన్నరెడ్డెయ్య, ఆనందరెడ్డి, వ్యవసాయ సహాయకురాలు రోషనారా, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలకే పరిమితమైన వంతెన


కుషావతినది ప్రవాహానికి ప్రయాణికుల కష్టాలు (ఫైల్ ఫొటో)

పెద్దమండ్యం, జూన్ 10: పెద్దమండ్యం సమీపంలోని పెద్దమండ్యం-గుర్రంకొండ రహదారి కుషావతినదిపై బ్రిడ్జి నిర్మాణం ప్రతిపాదనకే పరిమితమైంది. ఐదేళ్ల క్రితం పెద్దమండ్యం- గుర్రంకొండ రహదారి డబుల్ తారురోడ్డు పూర్తైనా రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా జరగాల్సిన బ్రిడ్జి నిర్మాణం జాప్యం జరిగింది. తారురోడ్డు నిర్మాణ సమయంలో తుఫాన్ తాకిడికి ఉధృతంగా ప్రవహిస్తున్న కుషావతి ప్రవాహంలో జీపు కొట్టుకుపోయి బోల్తా పడి అందులో ప్రయాణిస్తున్న ఐదుగురిలో నలుగురు ప్రాణాపాయస్థితి నుంచి బయట పడగా ఒకరు మృతి చెందారు. అప్పుడు కుషావతినదిపై భారీ బ్రిడ్జి నిర్మాణానికి ఆర్అండ్‌బీ ప్రతిపాదన చేసినట్లు అధికారులు తెలిపారు. ఆరేళ్లు గడుస్తున్నా బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజల నుంచి విమర్శలొస్తున్నాయి. ప్రతి ఏడాది వర్షాకాలంలో ఈ మార్గంలో ప్రయాణికులు, స్థానికులు పలు ఇక్కట్లు పడుతున్నారు. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైన జిల్లా అధికారులు చర్యలు తీసుకొని కుషావతిపై త్వరలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.4 కోట్లతో ప్రతిపాదనలు పంపాం

పెద్దమండ్యం కుషావతినదిపై బ్రిడ్జి నిర్మాణ అభివృద్ధి పనులకు ఇటీవలె ప్రభుత్వానికి రూ. 4 కోట్ల కు ప్రతిపాదన పంపినట్లు ఆర్అండ్‌బీ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని ఏఈ పేర్కొన్నారు.

ఘనంగా ఏనుగు మల్లమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో ఏనుగు మల్లమ్మ

బి.కొత్తకోట, జూన్10: బి.కొత్తకోట మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్స్ లీహిల్స్‌లో వెలసిన ఏనుగుమల్లమ్మ జాతర ఘనంగా జరుగుతోంది. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకకు ఆదివారం కోటావూరు, అమ్మవారి పుట్టినిల్లు అయిన బయప్పగారిపల్లెలలో చాటింపు వేశారు. కొండపై ఉన్న ఆలయాన్ని విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా అలంకరించారు. సోమవారం అశ్వ, గజవాహనాలలో అమ్మవారి ఉత్సవమూర్తిని సుందరంగా అలంకరించి ఊరేగించారు. అర్చకులు రామమూర్తి, చంద్రయ్యలు శాస్త్రోక్తంగా అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు కైంకర్యాలను నిర్వహించారు. జాతర వేడుకలలో భాగంగా చివరి రోజైన మంగళవారం ఉదయం నుంచి ఆలయం వద్ద తీర్థప్రసాదాలతో పాటు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం భక్తులు ఏనుగుమల్లమ్మకు జ్యోతులు మోస్తారు. రాత్రికి మేళతాళాలతో కొండపై అమ్మవారిని ఊరేగిస్తారు. ఆలయ ధర్మకర్త మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకలో రాజేంద్రప్రసాద్ రెడ్డితో పాటు ఏపీ టూరిజం, ఫారెస్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై దాడి చేస్తే ఊరుకోం

● తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు


వెంకటేశ్‌ను పరామర్శిస్తున్న శ్రీరామ్‌చినబాబు, సుధాకర్‌నాయుడు

మదనపల్లె టౌన్, జూన్ 10: అకారణంగా టీడీపీ నాయకులపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోమని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు పేర్కొన్నారు. సోమవారం మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో చికిత్స పొందుతున్న బురకాయలకోటకు చెందిన టీడీపీ నాయకుడు వెంకటేశ్ రాజును, టీడీపీ సీనియర్ నేత మార్పూరి సుధాకర్‌నాయుడుతో కలిసి చినబాబు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనను చూసి ప్రజలు ఆ పార్టీని ఘోరంగా ఓడించినా..వారికి ఇంకా బుద్ధి రాలేదన్నారు. తంబళ్లపల్లెలో ఇంకా వైసీపీ నాయకులు రెచ్చిపోతున్నారని, మద్యం తాగి అకారణంగా వెంకటేశ్‌రాజుపై దాడి చేసిన ముగ్గురిని పోలీసులు వెంటనే అరెస్టు చేయడంతో పాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజుతో వారు మాట్లాడారు. టీడీపీ నాయకులు దొరస్వామినాయుడు, నాదెళ్ల అరుణ్‌తేజ, మహబూబ్‌ఖాన్, మౌలా, విజయ్ కుమార్, రామకృష్ణరాజు, గోపాల్‌రాజు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల జోలికొస్తే ఖబద్దార్

ములకలచెరువు, జూన్ 10: టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే ఎంతటివారినైనా వదలిపెట్టేది ఖబద్దార్ అంటూ తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు హెచ్చరించారు. మండలంలోని బురకాయలకోటలో జరిగిన వైసీపీ అల్లరిమూకల దాడిలో గాయపడి మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుదున్న టీడీపీ కార్యకర్త వెంకటేష్‌రాజును సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ అనంతరం తంబళ్లపల్లె నియోజవర్గంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు దాడులకు దిగుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో వైసీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. నియోజకవర్గంలో కొన్ని చోట్ల టీడీపీ మద్దతుదారులు ఉన్న చోట వైసీపీ సర్పంచులు తాగునీరు కూడా సరఫరా చేయడం లేదని ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిని వదలిపెట్టమన్నారు. ఆయన వెంట టీడీపీ నేతలు ముత్తుకూరు మౌళా, రామకృష్ణమరాజు తదితరులు ఉన్నారు. అలాగే టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, నాయకులు లక్ష్మీనారాయణ, నారాయణస్వామి, గణేష్ తదితరులు టీడీపీ కార్యకర్త వెంకటేష్‌రాజును పరామర్శించారు.

కలికిరి సింగిల్ విండో అధ్యక్షుడు రాజీనామా


సీఈవోకు రాజీనామా పత్రం అందజేస్తున్న శ్రీకర్ రెడ్డి

కలికిరి, జూన్ 10: కలికిరి ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు నల్లారి శ్రీకర్ రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన సంఘం సీఈవో కొండప్పకు తన రాజీనామా లేఖను అందజేశారు. 2021 జూలై 1న శ్రీకర్ రెడ్డిని సొసైటీకి సంవత్సరంపాటు ఇన్ అధ్యక్షుడుగా నామినేట్ చేసింది. అప్పటి నుంచి గడువు పొడిగిస్తూ వచ్చారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానున్న దరిమిలా అన్ని నామినేటెడ్ పోస్టుల నుంచి నియామకాలను పొందిన వారిని రాజీనామా చేయించాలని జారీ అయిన ఆదేశాల మేరకు శ్రీకర్ రెడ్డి కూడా పదవికి రాజీనామా చేశారు.

సింగిల్ విండో చైర్మన్ రాజీనామా

గుర్రంకొండ, జూన్ 10:గుర్రంకొండ సింగిల్ విండో చైర్మన్ ఎస్.చంద్రశేఖర్ తన పదవికి సోమవారం రాజీనామా చేసినట్లు సీఈవో అనిల్ తెలిపారు. త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా ఎస్.చంద్రశేఖర్, సభ్యులుగా ఎస్.రెడ్డికుమార్, ఎస్.శ్రీనివాసులను ఎన్నుకున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో వైసీపీ ఓటమి చెందడంతో త్రిసభ్య కమిటీ సభ్యులు తమ పదవులకు రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు.

రామసముద్రం అధ్యక్షుడు కేశవరెడ్డి రాజీనామా


రామసముద్రం, జూన్ 10: మండల సహకార బ్యాంకు అధ్యక్షుడిగా ఉన్న కేశవరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం సాధించి అధికారం చేపట్టనుండడంతో సోమవారం తన రాజీనామా లేఖను ఉన్నతాధికారులకు పంపి ఆయోదించాలని ఆయన కోరారు. ఈసందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ గత 12ఏళ్లుగా సింగిల్‌విండో అధ్యక్షుడుగా పనిచేసిన తనకు సహకరించిన అధికారులకు, బోర్డు సభ్యులకు, రైతులకు పేరు పేరున కృతజ్ఞతలు తెలియజేశారు.

వాల్మీకిపురానికి పూర్వవైభవం తీసుకువస్తాం


వాల్మీకిపురంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మార్కెట్ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి

వాల్మీకిపురం, జూన్ 10: వాల్మీకిపురం మండలానికి పూర్వ వైభవం తీసుకువస్తామని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మార్కెట్ కార్యాలయం ఎదుట దివంగత మాజీ మంత్రి నల్లారి అమరనాథరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన చర్చించారు. ఈసందర్భంగా ఆయన పీలేరు కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి గెలుపునకు చిత్తశుద్ధితో కృషి చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. వాల్మీకిపురం మండలంలో ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం తమ అభివృద్ధి పనులను పరుగులు పెట్టించడమే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ప్రథమ కర్తవ్యమన్నారు. నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా వారి వెన్నంటే ఉండి పరిష్కరించడం జరుగుతుందన్నారు. కక్షలు, దౌర్జన్యాలకు కాకుండా అభివృద్దే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యక్షుడు బొక్కసం రామకృష్ణ, పీలేరు పార్టీ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు పీవీ నారాయణ, రాజేంద్రాచారి, కోసూరి రమేష్, చంద్రమౌళి, కువైట్ సయ్యద్‌బాషా,మురళి, అడ్వకేట్ రమణ, అనంద,డిష్ బ్రదర్స్, సైదు, కలందర్, గాంధీపేట రెడ్డి, రమేష్‌బాబు, సాంబ, జావీద్, శంకర్, గోవిందు, కేకే నాయుడు, మహ్మద్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పేదవిద్యార్థులకు ఉచితంగా బ్యాగులు పంపిణీ


పేదవిద్యార్థులకు ఉచితంగా బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

మదనపల్లె అర్బన్, జూన్ 10: వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటీవ్ వైస్ ప్రెసిడెంట్ ఇరుకుల రామకృష్ణ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సోమవారం పేద విద్యార్థులకు మదనపల్లె వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా బ్యాగులు పంపిణీ చేశారు. అలాగే ఆయన చేతులమీదుగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పుంగనూరు రోడ్డు గోశాలలో డోనర్ లక్ష్మీపతి సహకారంతో రూ. 3 వేలు పచ్చిగడ్డి వితరణ చేశారు. ఈ సందర్భంగా గోపూజ చేసి కేక్‌కట్ చేసి సభ్యులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఐఈసీ ఆఫీసర్ కెఎస్ కృష్ణమూర్తి, వి. వెంకటేష్‌బాబు, గవర్నర్ సోమిశెట్టి సురేష్‌బాబు, పులిరాజా, ఆనంద్, మహీంద్రకుమార్, లక్ష్మీపతి, అశోక్‌కుమార్, ప్రభాకర్ శెట్టితోపాటు మదనపల్లె వాసవీక్లబ్ అధ్యక్షుడు శ్రీనాథ్, కార్యదర్శి అమరనాథ్, ట్రెజరర్ పీఆర్ లక్ష్మీదీపక్, వనితక్లబ్ అధ్యక్షురాలు జ్యోతి, బి.కొత్తకోట అధ్యక్షురాలు విశాలక్ష్మి, కార్యదర్శి సుబ్బలక్ష్మమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

బీసీజీ టీకాతో క్షయ వ్యాధి నయం

గుర్రంకొండ, జూన్ 10:బీసీజీ టీకాతో క్షయ వ్యాధిని నిర్మూలించవచ్చని ఆరోగ్య వైద్యాధికారి మహ్మద్‌రఫీ పేర్కొన్నారు. మండలంలోని తరిగొండ పీహెచ్‌సీ పరిధిలోని మర్రిపాడులో ప్రజలకు బీసీజీ టీకాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో క్షయ వ్యాధి సోకకుండా బీసీజీ టీకా ఉపయోగపడుతుందన్నారు. బీసీజీ టీకాతో క్షయ వ్యాధి మరణాలను తగ్గించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.